ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

హిందూపురం, మడకశిర, పెనుకొండ :9985445760
ధర్మవరం, పుట్టపర్తి : 9963160529
కదిరి :9052518170
ఏసీఎం: 9985411154

పంచసూత్రాలే పరమావధిగా సేవ

సత్యసాయి సేవాసంస్థల అమెరికా అధ్యక్షుడు బాలు

పుట్టపర్తి, జూలై 11(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా బోధించిన సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస పంచ సూత్రాలే పరమావధిగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని సత్యసాయి సేవాసంస్థల అమెరికా అధ్యక్షుడు ప్రొఫెసర్ బాలు కరణం పేర్కొన్నారు. అమెరికా భక్తులు పర్తియాత్ర పేరిట శుక్రవారం ప్రశాంతి నిలయం చేరుకున్నారు. సాయంత్రం సాయికుల్వంతు సభామండపంలో శ్రీసత్యసాయి ఎడ్యుకేర్ బాలవికాస్ కరికులం పేరిట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ బాలు కరణం ప్రసంగిస్తూ అమెరికాలో బాలవికాస్ విద్య ద్వారా సత్యసాయి ప్రేమతత్వాన్ని, విద్యను బోధిస్తున్నామన్నారు. 500 మంది గురువులు పలు రాష్ట్రాల్లో బాలవికాస్ విద్యను బోధిస్తున్నట్లు వెల్లడించారు. సత్యసాయి చూపిన సేవ, ప్రేమ మార్గంలోనే తమవంతు సేవలను కొనసాగిస్తున్నామన్నారు. అనంతరం సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యులు ఆర్‌జేరత్నాకర్, సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి, సేవాసంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్‌పాండే, ఐఎస్ఎన్ ప్రసాద్, అక్షయ్ కలాదీలు శ్రీసత్యసాయి ఎడ్యుకేర్‌పై పుస్తకాన్ని ఆవిష్కరించారు. సేవాదళ్ సభ్యులు భక్తి గీతాలు ఆలపించారు.



ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ బాలు కరణం



సత్యసాయి ఎడ్యుకేర్‌పై పుస్తకాన్ని విడుదల చేస్తున్న ట్రస్టు సభ్యులు

నిద్రలో నిఘా..!



చోరీ జరిగిన టీ కొట్టు

వరుస దొంగతనాలతో ప్రజలు బెంబేలు

కదిరి పోలీసులకు సవాల్‌గా మారిన దొంగలు

కదిరి, జూలై 11(ఆంధ్రజ్యోతి): వరుసగా జరుగుతున్న దొంగతనాలు పట్టణ ప్రజలకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. శివారు ప్రాంతాలే లక్ష్యంగా దొంగలు రెచ్చిపోతున్నారు. నెలన్నరలోపే పట్టణంలో రెండు భారీ దొంగతనాలు జరిగాయి. పెద్ద మొత్తంలో బంగారం చోరీ చేశారు. పోలీసుల నిఘా, గస్తీ కొరవడటంతోనే చోరీలు జరుగుతున్నాయని పట్టణ ప్రజలు విమర్శిస్తున్నారు. ఈక్రమంలో ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లాలంటేనే ప్రజలు జంకే పరిస్థితి ఏర్పడింది. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన వారితో ఫిర్యాదు తీసుకోవడం, కేసులు నమోదు చేయడమే పోలీసులు పనిగా పెట్టుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రెండు భారీ దొంగతనాలు

కదిరిలో నెలన్నరలోపే రెండు భారీ దొంగతనాలు జరిగాయి. కిటికీ ఊచలను కట్ చేసి, ఇంట్లోకి చొరబడి సొమ్మంత దోచుకెళ్లారు. దొంగతనాలు జరిగినా ప్రతిసారి డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీంతో పరిశీలించడం తప్ప గస్తీ పెంచింది లేదనే విమర్శలు పోలీసులపై ఉన్నాయి. గత నెల ఒకటిన వైశ్యాబ్యాంక్ కాలనీలో ఓ అధ్యాపకురాలు రాత్రి ఇంటిలో నిద్రపోతుండగా బెడ్‌రూం కిటికీ తొలగించి ఇంట్లోకి చొరపడ్డారు. ఇంట్లో ఉన్న 10 తులాల బంగారం, నాలుగు కిలోల వెండి, లక్ష రూపాయల నగదు దోచుకెళ్లారు. ఈనెల ఆరో తేదీ రాత్రి రాయచోటి రోడ్డుకు సమీపంలోని నారాయణరెడ్డి వీధిలోని నరసారెడ్డి ఇంటికి తాళం వేసి ఉండటంతో కిటికీని తొలగించి ఇంట్లోకి చొరబడ్డారు. ఇంట్లో ఉన్న 17తులాల బంగారం చోరీ చేశారు. మే12న జీవిమానుకు సమీపంలో ఉన్న ఇంటిలో మూడు తులాల బంగారం, రూ. 30 వేలు డబ్బు చోరీ చేశారు. మే10న నల్లగుట్ట వీధిలో ఓ ఇంటిలో 5 తులాల బంగారం, రూ.80వేలు ఎత్తు కెళ్లారు. జూన్ 7న బస్టాండులో దిగిన గాలివీడుకు చెందిన మహిళ పర్సును కొట్టేశారు. అందులో ఏడు తులాల బంగారు ఉన్నట్లు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. జరుగుతున్న దొంగతనాలను గమనిస్తే దొంగలు శివారు ప్రాంతాలను ఎంచుకొని, రెక్కి నిర్వహించి, చోరీలకు (మిగతా 6లో..)

ఆఖరి గడియలు పార్టీ సేవలో..!

- టీడీపీ నాయకుడు గంగన్నకు గుండెపోటు
- ఎమ్మెల్యే పల్లె సింధూరతో కలిసి పార్టీ కార్యక్రమాలు
- ఇంటికి వెళ్లగానే పలకరించిన మృత్యువు
- సొంత వాహనంలో ఆస్పత్రికి పంపిన ఎమ్మెల్యే.. అయినా..!

బుక్కపట్నం, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు సత్యప్పగారి గంగన్న (85)కు శుక్రవారం ఇంట్లోనే గుండెపోటు రావడంతో కాలనీలోనే పర్యటిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి వెంటనే స్పందించారు. కార్యక్రమాన్ని రద్దు చేసుకుని, హుటాహుటిన సొంత వాహనంలో ఆయనను దగ్గరుండి ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చేర్పారు. చికిత్స పొందుతూ ఆయన మరణించడంతో ఎమ్మెల్యే తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

ఇంటికి పిలిచి.. సత్కరించి..

బుక్కపట్నంలోని పాత ఎస్సీ కాలనీలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం చేపట్టేందుకు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి శుక్రవారం వచ్చారు. అదే కాలనీకి చెందిన సీనియర్ నాయకుడు సత్యప్పగారి గంగన్న.. ఎమ్మెల్యేకి స్వాగతం పలికి, తన ఇంటికి తీసుకెళ్లి, ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే కాలనీలో కార్యక్రమం చేపట్టారు. గంగన్న వయసురీత్యా ఇంట్లోనే ఉండిపోయారు. కాసేపటికే ఆయన గుండెపోటుతో ఇంట్లో కుప్పకూలారు. కార్యకర్తల ద్వారా సమాచారం అందుకున్న ఎమ్మెల్యే.. కార్యక్రమాన్ని రద్దు చేసుకుని, హుటాహుటిన గంగన్న ఇంటికి చేరుకున్నారు. పడిపోయిన ఆయనను దగ్గరుండి తన వాహనంలో ఎక్కించుకుని, పుట్టపర్తిలోని సత్యసాయి జనరల్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను కోరారు. చికిత్స పొందుతూ గంగన్న మరణించారు. దీంతో ఎమ్మెల్యే తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కాసేపటి క్రితమే తనను ఇంటికి పిలిచి, సత్కరించి, జ్యూస్ ఇచ్చి.. ఆప్యాయంగా పలకరించిన గంగన్న ఇంతలోనే మరణించడం బాధాకరమన్నారు. ఆయన మృతికి ఎమ్మెల్యే ప్రగాఢ సంతాపం తెలిపారు. విషయాన్ని వెంటనే టీడీపీ రాష్ట్ర కార్యాలయానికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు.

అండగా ఉంటాం..

సీనియర్ నాయకుడు గంగన్న మృతి బాధాకరమని మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అన్నారు. ఆయన కుటుంబానికి టీడీపీ, పల్లె కుటుంబం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అన్నివిధాలా ఆదుకుంటామన్నారు. గంగన్న 2001లో ఎంపీటీసీ ఎన్నికల్లో టీడీపీ మద్దతుతో పోటీ చేశారు. గంగన్న భార్య గతంలోనే మరణించారు. ముగ్గురు కుమారులు కాగా, ఇద్దరు మృతిచెందారు. వారి భార్యలు, పిల్లల ఆలనాపాలన గంగన్న చూసుకునేవారు. గంగన్న మృతితో వారు దిక్కులేనివారయ్యారు. ఈనెల 10వ తేదీన కొత్తచెరువులో నిర్వహించిన మెగా పీటీఎం కార్యక్రమానికి హాజరైన గంగన్న.. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి, ఫొటోలు దిగారు.



గంగన్నను ఆస్పత్రికి తరలిస్తున్న ఎమ్మెల్యే సింధూర



గంగన్న (ఫైల్)

ధర్మవరం అభివృద్ధే ధ్యేయం

- మంత్రి సత్యకుమార్‌యాదవ్

ధర్మవరం, జూలై 11(ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో ధర్మవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పేర్కొన్నారు. తన ఏడాది పాలనను పురస్కరించుకుని ధర్మవరంలో శుక్రవారం ఆయన పాదయాత్ర నిర్వహించారు. తొలుత తిక్కస్వామినగర్ శివాలయంలో పూజలు చేసి పాదయాత్ర ఆరంభించారు. ముఖ్య అతిథులుగా నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి హాజరయ్యారు. ఆరో వార్డులో మంత్రి ప్రజల సమస్యలు సావధానంగా విన్నారు. ప్రధానంగా శివానగర్, సంజయ్‌నగర్, గాంధీనగర్, ఇందిరానగర్, పీఆర్‌టీ వీధుల్లో సమస్యల ను ప్రజలు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. మురుగు కాలువలు శుభ్రత, కాలువల నిర్మాణం, పాడైన సీసీరోడ్ల నిర్మాణం, తాగునీటి సరఫరాలో లోపాలు వంటి సమస్యలను ప్రజలు ఆయనకు వివరించారు. ప్రధాన రహదారుల్లో కల్వర్టుల నిర్మాణం, పింఛన్లు, చేనేత కార్మికుల విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ప్రజల జీవితాల్లో మార్పు ప్రారంభమైందన్నారు. నియోజకవర్గంలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి రూ.110 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. రూ.9కోట్లతో రోడ్లు, కాలువల అభివృద్ధి పనులు ప్రారంభించామన్నారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ ప్రజల ఇంటి వద్దకు పాలనను తీసుకెళ్లిన ఈ పాద యాత్ర ఆదర్శప్రాయంగా నిలుస్తుందన్నారు. చిలకం మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి చేసే పాదయాత్ర వల్ల ప్రజల మనస్సుల్లో మళ్లీ విశ్వాసం నెలకొంటోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, ఏపీ సీడ్స్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, టీడీపీ నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జ్ చింతలపల్లి మహేశ్‌చౌదరి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, టీడీపీ నాయకులు ఫణికుమార్, పురుషోత్తంగౌడ్, సంధారాఘవ, భీమనేని ప్రసాద్‌నాయుడు, నాగూర్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్రలో ప్రజా సమస్యలను వింటున్న మంత్రి

పాపం.. పసివారు..!

నవీన్‌కు ఇద్దరు కూతుళ్లు.. ఓ కుమారుడు. అందరూ పసివారే. కొడుకు సొంతూరులోనే ఒకటో తరగతి చదువుతున్నాడు. కూతుళ్లు కదిరి కేజీబీవీలో చదువుతున్నారు. మూడేళ్ల క్రితం తల్లిని పోగొట్టుకున్నారు. తాత, తండ్రి వారి బాగోగులు చూసుకునేవారు. ఇంతలో నవీన్ హత్యకు గురయ్యాడు. మరో మహిళతో సాన్నిహిత్యం అతని ప్రాణాలను తీసింది. ముగ్గురు చిన్నారులు తండ్రిని కూడా కోల్పోయారు. ఇప్పుడు వారి పరిస్థితి ఏమిటని తాత రాఘవయ్య కన్నీరుమున్నీరయ్యారు.

7



నవీన్ పిల్లలు

రికార్డు సృష్టించారు

6

లక్ష్యానికి మించి హంద్రీనీవా లైనింగ్ పనులు

24గంటల్లో 79వేల చదరపు మీటర్ల పనులు పూర్తి

జనాభాపై అవగాహన ఉండాలి

- డీఎంహెచ్ఓ, డీసీహెచ్ఎస్



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా వైద్యాధికారి

పుట్టపర్తి రూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): జనాభా విషయంగా ప్రజలు అవగాహన కలిగి ఉండాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజ్ బేగం, డీసీహెచ్ఎస్ మధుసూదన్ పేర్కొన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఎనుములపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నుంచి జిల్లా స్థాయి జనాభా నియంత్రణ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని వారు జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని గణేష్ కూడలి వరకు ర్యాలీని కొనసాగించి అక్కడ మానవహారం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా జిల్లా అధికారులు మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ, సంతానోత్పత్తి, పునరుత్పత్తి, ఆరోగ్య సంరక్షణ అంశాలపై ప్రజల్లో అవగాహన అవసరమన్నారు. తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులను పాటించడం వలన తల్లిబిడ్డలు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్యాధికారి డాక్టర్ సునీల్, డిప్యూటీ డెమో బాబాఫకృద్దీన్, వైద్యులు డాక్టర్ నాగదుర్గాదేవి, సీహెచ్ఓ శివరాం, పీహెచ్‌సీ,సీహెచ్‌సీ సిబ్బంది జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

పంటల బీమా.. రైతన్నకు ధీమా

6


- క్రాప్ ఇన్సూరెన్స్‌తో అన్నదాతలకు లాభం
- పంట నష్టం జరిగితే బీమా వర్తింపు

కొత్త కంచె..!

తనకల్లు, జూలై 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొన్నేళ్ల క్రితం వరకు వర్షాధారం కింద వేరుశనగ విస్తారంగా సాగు చేసేవారు. అటవీ సమీప ప్రాంతాల్లో వన్యప్రాణులు.. పంటలపై దాడులు చేసేవి. ఒక్కో పొలంలో కొంతమేర ధ్వంసం చేసేవి. దీంతో రైతులు పెద్దగా నష్టపోయేవారు కాదు. ప్రస్తుతం వేరుశనగ సాగు బాగా తగ్గిపోయింది. అక్కడక్కడా మాత్రమే వేస్తున్నారు. దీంతో ఆయా రైతులకు పంటను కాపాడుకోవడం కష్టంగా మారింది. వన్యప్రాణులు దాడులు చేస్తే పంటంతా కోల్పోవాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో తనకల్లు మండలం నడిమికుంటపల్లికి చెందిన రైతు వెంకటరమణారెడ్డి వేరుశనగ పంటను కాపాడుకునేందుకు వినూత్నంగా ఆలోచించాడు. రైతు కర్ణాటక సరిహద్దులో పంట వేశాడు. ఒక్కడే పంట పెట్టడంతో అడిపందులు, జింకలు, నెమళ్ల బారి నుంచి కాపాడుకోవడానికి వినూత్నరీతిలో రక్షణ ఏర్పాటు చేశాడు. వాడి పడేసిన ఖాళీ వాటర్ బాటిళ్లతో కంచె కట్టాడు. దీంతోపాటు తెల్లటి దుస్తులు, ప్లాస్టిక్ కవర్లను కూడా కట్టి, గాలికి కదిలేలా పొడవుగా వదిలేశాడు. దీంతో గాలి వచ్చినపుడల్లా పొలం చుట్టూ ఉన్న ఖాళీ వాటర్‌బాటిళ్లు, తెల్లదుస్తులు, కవర్లు, కదులుతుండడంతోపాటు శబ్దం చేస్తున్నాయి. అంతేకాకుండా పొలం మధ్యలో పెద్ద కట్టెలు నాటి వాటికి బీరు సీసాలను కట్టాడు. వాటికి రేకులు, మేకులు తగిలేలా వేలాడదీశాడు. మేకులకు కిందిభాగాన పెద్దపెద్ద అట్టముక్కలు, వాడిపడేసిన టమోట క్రేట్లను వేలాడదీశాడు. గాలి వచ్చినపుడల్లా అట్టముక్కలు, టమోటా క్రేట్లు కదులుతుండడంతో వాటికి వేలాడదీసిన రేకులు, ఇనుప మేకులు సీసాలకు తగిలి శబ్దాలు వస్తున్నాయి. వాటి శబ్దాలకు అడవి పందులు, జింకలు, నెమళ్లు రావడం లేదని రైతు చెబుతున్నాడు. గతంలో అందరూ పంట సాగుచేసేవారమనీ, దీంతో వన్యప్రాణులు ఎక్కడో ఒకచోట ఆహారం తినేసి వెళ్లేవని రైతు తెలిపాడు. ప్రస్తుతం ఒకరిద్దరే సాగుచేయడంతో పంటను కాపాడుకోవడానికి నానాతంటాలు పడాల్సి వస్తోందన్నారు.



పొలంలో వేలాడదీసిన ఖాళీ బీరు సీసా



పొలం చుట్టూ వేలాడదీసిన ఖాళీ వాటర్ బాటిళ్లు

దెబ్బతిన్న బండ పరుపు



ఎంత సొమ్ము వృథానో..!

● నిరుపయోగంగా చాగల్లు ప్రాజెక్ట్ కార్యాలయాలు ● శిథిలావస్థలో హెచ్చెల్సీ క్వార్టర్లు ● పట్టించుకోని అధికారులు

తాడిపత్రి, జూలై 11(ఆంధ్రజ్యోతి): లక్షలు వెచ్చించి నిర్మించిన చాగల్లు ప్రాజెక్ట్ కార్యాలయాలు నిరుపయోగంగా మారాయి. అలనా పాలన లేకపోవడంతో శిథిలావస్థకు చేరాయి. చాగల్లు ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తయిన తర్వాత అప్పటి ప్రభుత్వం తాడిపత్రి రైల్వేస్టేషన్ పక్కనే సమీపంలో చాగల్లు ప్రాజెక్ట్ కార్యాలయాన్ని దాదాపు రూ.50 లక్షలతో నిర్మించింది. హెచ్చెల్సీ ఆఫీసులకు సంబంధించి ఎన్నోఏళ్ల నుంచి ఉన్న భవనాలు దెబ్బతినడంతో వాటిస్థానంలో ప్రాజెక్ట్ కార్యాలయాల పక్కనే దాదాపు రూ.2కోట్లు వరకు వెచ్చించి కార్యాలయాలతోపాటు క్వార్టర్స్‌ను కూడా ఏర్పాటుచేశారు. కొత్తగా నిర్మించిన సమయంలో కొద్ది రోజులు కార్యాలయంలో కార్యకలాపాలు జరిపారు. రాత్రిపూట ఇబ్బందిగా ఉందంటూ తర్వాత వాటిని మూసివేసి పాత కార్యాలయాల్లోకే మకాం మార్చారు. ఇది జరిగి దాదాపు 15 ఏళ్లు గడిచాయి. అప్పటి నుంచి వాటిని పట్టించుకోలేదు. దీంతో కొందరు దుండగులు భవనాలకు ఉండే సామగ్రిని ధ్వంసం చేయడంతోపాటు తలుపులు, కిటీకీలు ఎత్తుకొని వెళ్లారు. అక్కడ అసాంఘిక కార్యక్రమాలు కూడా జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది గొర్రెలను వాటిలో తోలుకుంటున్నారు. వీటనన్నింటిని చూసినా అధికారులు మాత్రం ఏమి తెలియనట్లు ప్రవర్తిస్తున్నారు. భవనాలు శిథిలావస్థకు చేరడంతో చుట్టూ ముళ్లపొదలు పెరిగి, చిట్టడవిని తలపిస్తోంది. చాగల్లు ప్రాజెక్ట్ అధికారులు ఇక్కడ లేకుండా జిల్లాకేంద్రానికి మకాం మార్చారు. అక్కడి నుంచి కార్యకలాపాలు జరుపుతున్నారు. దీంతో కార్యాలయాన్ని, క్వార్టర్స్‌ను పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు.



ధ్వంసమైన కిటికీలు

● అధికారులను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా అక్కడ అప్పట్లో కార్యాలయాలు క్వార్టర్లు నిర్మించారు. అందులో సిబ్బంది ఉంటుండగానే దొంగతనాలు జరిగాయి. దీంతో బెదిరి పాత భవనమే బాగుంటుందన్న ఆలోచనతో అప్పట్లో ఇక్కడ చేరినట్లు తెలిపారు. తర్వాత ప్రభుత్వాలు మారినా ప్రాజెక్ట్ కార్యాలయం, క్వార్టర్ల గురించి పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత ఈ కూటమి ప్రభుత్వమైనా వీటిని పట్టించుకుని భవనాలను వినియోగంలోకి తెస్తుందేమోనని ఆశిస్తున్నట్లు తెలిపారు.



చాగల్లు ప్రాజెక్ట్ కార్యాలయం

తలుపులు మాయం..





ఏపుగా పెరిగిన ముళ్లపొదలు

పంటల బీమా.. రైతన్నకు ధీమా

● క్రాప్ ఇన్సూరెన్స్‌తో అన్నదాతలకు లాభం ● పంట నష్టం వాటిల్లితే బీమా వర్తింపు ● ప్రీమియం అధికంగా ఉండటంతో కొందరు దూరం

దానిమ్మ తోటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్(ఫైల్)



కొత్తచెరువు, జూలై 11(ఆంధ్రజ్యోతి): అతివృష్టి, అనావృష్టితో నష్టపోతున్న అన్నదాతలను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధానమంత్రి ఫసల్ బీమా, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాల అమలుకు శ్రీకారం చుట్టాయి. ఫసల్‌బీమాకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 15 వరకు, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకానికి ఈ నెలాఖరు వరకు గడువు ఉన్నట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. సొంతభూమి ఉన్నవారు, కౌలుదారులు బీమా పథకాలకు అర్హులని జిల్లా ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్ తెలిపారు.

ఫసల్ బీమా వర్తించే పంటలు..

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) ఈ ఏడాది ఖరీఫ్‌లో పశ్చిమగోదావరి, శ్రీసత్యసాయి, విజయనగరం జిల్లాల్లో మాత్ర మే అమలౌతోంది. వరి, మొక్కజొన్న, కందులు, రాగులు, ఆముదం, నువ్వుల పంటలకు ఈ బీమా వర్తిస్తుంది. పంటకోత ప్రయోగాల (సీసీఈ) నివేదిక ప్రకారం సగటు దిగుబడికంటే ఆ సంవత్సర దిగుబడి తక్కువ ఉన్నట్లయితే పంట నష్టపరిహారం వస్తుంది. ఈ పరిహారాన్ని అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఏఐసీ)ద్వారా రైతులకు ప్రభుత్వం అందజేస్తుంది.

దరఖాస్తు ఇలా...

సొంత భూమి కల్గిన రైతులు, కౌలుదారులు ఫసల్ బీమా యోజనకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. బ్యాంకుల్లో కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా, పంట రుణం పొందిన వారు బీమాను పొందవచ్చు. బ్యాంకుల్లో రుణం పొందనివారు, బీమాకు కొత్తగా దరఖాస్తు చేసుకొనే వారు సీఎస్‌సీ(కామన్ సర్వీస్ సెంటర్), మీసేవా, బీమా కంపెనీ ఏజెంట్ల వద్దగాని, పీఎంఎఫ్‌బీవై పోర్టల్(డబ్లుడబ్లుడబ్లు.పీఎంఎఫ్‌బీవై.జీఓవీ.ఇన్) ద్వారా గాని, పీఎంఎఫ్‌బీవై మొబైల్ అప్లికేషన్ ద్వారా ప్రక్రియను పూర్తి చేయవచ్చు. దరఖాస్తుకు బ్యాంక్ పాస్‌బుక్, ఆధార్ కార్డు, భూమి పాస్ బుక్ జిరాక్సులతో పాటు రైతుసేవా కేంద్రాల్లో పనిచేసే వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏలు పంట వేసినట్లు ఇచ్చే ధ్రువపత్రాన్ని జతపరచాలని వ్యవసాధికారులు చెబుతున్నారు.



హిందూపురం వద్ద సాగుచేసిన టమోటా పంట

వాతావరణ బీమా.. వీటికే..

వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాన్ని ప్రభుత్వం పంట సాగుచేసిన ప్రతి రైతుకు అందిస్తోంది. వాతావరణ బీమాకు కూడా ఫసల్ బీమా మాదిరిగానే సచివాలయం, సీఎస్‌సీ సెంటర్లలోను, పీఏసీఎస్, పోస్టాఫీసు ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్(ఎన్సీఐపీ)వెబ్‌సైటట లేదా మొబైల్ యాప్ ద్వారా కూడా చేసుకోవచ్చు. ఈ బీమా పథకం కిందకు పత్తి, వేరుశనగ, టమోటాతో పాటు ఉద్యాన పంటలు వస్తాయయని వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు.

ప్రీమియం వివరాలు ఇలా..		
పంట	ఎకరాకు చెల్లించాల్సిన ప్రీమియం	ప్రభుత్వం ఎకరాకు ఇచ్చే బీమా
వరి	రూ.200	రూ.40 వేలు
మొక్కజొన్న	రూ.165	రూ.33 వేలు
కందులు	రూ.102	రూ.20 వేలు
రాగులు	రూ.100	రూ.20 వేలు
ఆముదం	రూ.100	రూ.20 వేలు

ప్రీమియం వివరాలు ఇలా..		
పంట	రైతు హెక్టారుకు చెల్లించవలసిన ప్రీమియం	ప్రభుత్వం హెక్టారుకు చెల్లించే పరిహారం
బత్తాయి	రూ.6875	రూ.1,37,500
వేరుశనగ	రూ.1600	రూ.80 వేలు
దానిమ్మ	రూ.9375	రూ.1,87,500
పత్తి	రూ.4750	రూ.95 వేలు
టమోట	రూ.4000	రూ.80 వేలు

వాతావరణ బీమా ఇలా..

ప్రభుత్వం వాతావరణ ఆధారిత పంటల బీమా విషయంలో వర్షపాతం, ఉష్ణోగ్రత, గాలి,వాన బీభత్సం, పాక్షిక ఆర్ద్రత ఆధారంగా పంట నష్టాన్ని లెక్కిస్తుంది. వాతావరణ అంశాల ఆధారంగా పంట నష్టాన్ని అంచనా వేసి ఆయా మండలాల పరిధిలో బీమా పరిహారం లెక్కిస్తారని అధికారులు చెబుతున్నారు. పంట నష్టాన్ని బీమా కంపెనీలు వాతావరణం, దిగుబడి ఆధారంగా అందిస్తాయి. వేరుశనగ, పత్తి, టమోట పంటలు సాగుచేసిన రైతులు క్రాప్ బుకింగ్ చేయించుకున్న వారికి మాత్రమే పంటనష్టం వర్తిస్తుందని బీమా కంపెనీ ప్రతినిధులు తెలియజేస్తున్నారు.

బీమా కోసం మామిడి రైతుల ఎదురుచూపు

జిల్లాలో మామిడి సాగు చేసి వర్షాలు, గాలులకు నష్టపోయిన రైతులు బీమా కోసం ఎదురు చూస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 2300 మంది రైతులకు సంబంధించి దాదాపు 4 వేల ఎకరాల్లో మామిడి పంట నష్టం జరిగినట్లు బీమా కంపెనీలు ప్రకటించాయి. అయితే ఇప్పటి వరకూ బీమా అందలేదని, కనీసం ఎప్పుడిస్తారన్న సమాచారం కూడా లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా బీమా ప్రీమియం అధికంగా ఉండటంతో చాలామంది రైతులు క్రాప్ ఇన్సూరెన్స్ చేసుకోలేదు. దీంతో వారంతా పంటల బీమాకు దూరమవుతున్నారు.

సొసైటీలకు జవసత్వాలు

● ఏడీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 11(ఆంధ్రజ్యోతి): జీతాలు కూడా చెల్లించలేని దయనీయ స్థితిలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (సొసైటీ)లకు జవసత్వాలు కల్పించేందుకు కృషి చేస్తానని ఏడీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి తెలిపారు. సొసైటీల అభివృద్ధి గురించి 'ఆంధ్రజ్యోతి'తో ఆయన పలు విషయాలు ముచ్చటించారు.

ప్ర: ఉమ్మడి జిల్లాలో ఎన్ని బ్రాంచ్‌లు, ఎన్ని సొసైటీలు ఉన్నాయి?

జ: ఉమ్మడి జిల్లాలో 28బ్రాంచ్‌లు, 108 సొసైటీలు ఉన్నాయి.

ప్ర: బ్యాంకు అభివృద్ధికి ఎలాంటి ప్రణాళికలు సిద్ధం చేశారు?

జ: బ్యాంకులో పరిస్థితులపై పరిశీలిస్తున్నా. ప్రధాన కార్యాలయంతో పాటు బ్రాంచ్‌ల్లో ఉన్న ఉద్యోగుల మధ్య మొదట సమన్వయం పెంచాల్సిన అవసరం ఉంది. అధికారుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించి సత్ఫలితాల కోసం కృషి చేస్తా.

ప్ర: బ్యాంకులో ప్రస్తుత పరిస్థితి ఎలా ఉంది?

జ: బ్యాంకులో ప్రస్తుతం అధికారుల మధ్య సమన్వయలోపం స్పష్టంగా కనిపిస్తోంది. బ్యాంకులో సీఈఓలుగా పనిచేసిన సీనియర్ అధికారులు ఉండటం, వారి మధ్య సఖ్యత లేకపోవడం బ్యాంకు తిరోగమనానికి ప్రధాన కారణంగా గుర్తించా. మా బ్యాంకు కుటుంబంలోని అందరినీ ఏకతాటిపైకి తీసువచ్చి సమష్టి కృషి చేయడానికి చర్యలు తీసుకుంటా.

ప్ర: వైసీపీ ప్రభుత్వంలో బ్యాంకులు, సొసైటీల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై చర్యలు తీసుకుంటారా?

జ: గతంలో బ్యాంకు, సొసైటీలలో అవినీతి, అక్రమాల ఆరోపణలు ఉన్న మాట వాస్తవమే. వాటన్నింటిపై క్షేత్రస్థాయిలో పరిశీలించి, తగిన చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోం. ముఖ్యంగా ఆత్మకూరు నకిలీ పట్టాల రుణాలు, ఉద్యోగి శ్రీధర్ వీఆర్ఎస్‌పై విచారణ చేపడుతాం. అవకతవకలకు పాల్పడినట్లు తేలితే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

ప్ర: మండలానికి ఒక బ్రాంచ్ పెట్టాలనే ప్రతిపాదన పరిస్థితి ఏమిటి?

జ: మండలానికి ఒక బ్రాంచ్ పెట్టాలనేది మంచి ఆలోచన. ప్రభుత్వం, ఆప్కాబ్, నాబార్డు, ఆర్‌బీఐ ఉన్నతాధికారులతో చర్చించి ఈ అంశం అమలు సాధ్యాసాధ్యాలపై సరైన నిర్ణయం తీసుకుంటాం.

ప్ర: బ్యాంకును నష్టాల నుంచి గట్టెక్కించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: ఏడీసీసీ బ్యాంకును పురోగతిలో మొదటి స్థానంలో నిలిపేందుకు మొదట ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడం, కమర్షియల్ బ్యాంకులకు దీటుగా ఆధునీకరించడం, డిపాజిట్ల సేకరణ, రైతులకు సేవలను మరింత చేరువ చేయడంపై దృష్టి సారిస్తున్నాం.

తలుపులు తీయరా స్వామీ..!



మధ్యాహ్నమైనా తెరుచుకోని ఈఓ కార్యాలయం

ఉరవకొండ, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి. నిత్యం జిల్లా నుంచే కాకుండా కర్ణాటక భక్తులు వందల సంఖ్యలో వస్తుంటారు. అలాంటి ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈఓ) కార్యాలయం శుక్రవారం మధ్యాహ్నమైనా తెరుచుకోలేదు. అధికారులు, సిబ్బంది ఎవరూలేరు. ఇక్కడ పనిచేస్తున్న పలువురు సిబ్బందిని డెప్యుటేషన్‌పై పంపగా.. ఈఓ, అటెండర్ మాత్రమే మిగిలారు. వారు కూడా సక్రమంగా విధులకు హాజరు కావట్లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో ఆలయంలో ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు అటెండర్లు ఉండేవారు. వారిలో ఒక జూనియర్ అసిస్టెంట్, అటెండర్‌ను పెద్ద పప్పూరు అశ్వత్థం ఆలయానికి డెప్యుటేషన్‌పై వేశారు. మరో జూనియర్ అసిస్టెంట్‌ను గూగూడుకు, ఇంకొకరిని పంపనూరుకు డెప్యుటేషన్‌పై వెళ్లారు. దీంతో ఉన్న కాంట్రాక్టు సిబ్బంది కూడా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. దీంతో కార్యాలయాన్ని తెరిచేవారు కరువయ్యారు. ఆలయ ఈఓ రమేష్, జూనియర్ అసిస్టెంట్ మాత్రమే ఉన్నారు. వారు కూడా విధులకు హాజరు కాలేదు. ఈనెల 10వ తేదీన దేవదాయ శాఖ ఆర్జేసీ చంద్రశేఖర్ ఆజాద్.. ఆలయాన్ని తనిఖీ చేశారు. ఆయన పర్యటనను గోప్యంగా ఉంచారు. దీనిపై సర్వత్రా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. డెప్యుటేషన్ల వ్యవహారం బయటపడకూడదనే పర్యటనపై గోప్యం వహించారన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు చొరవచూపి డెప్యుటేషన్‌పై వెళ్లిన సిబ్బందిని రప్పించాలని భక్తులు కోరుతున్నారు. ఈ విషయంపై ఈఓ రమేష్‌ను అడగ్గా.. పరిపాలన సౌలభ్యం దృష్ట్యా బదిలీ చేశారన్నారు. సిబ్బంది లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం సమావేశం ఉండడంతో తాను వెళ్లాననీ, ఆలయానికి రాలేకపోయానన్నారు.

నాటుసారా రహిత జిల్లాగా మార్చాలి

పుట్టపర్తి రూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): జిల్లాను సారా రహితంగా తీర్చిదిద్దాలని ఎక్సైజ్ శాఖ ఉమ్మడి జిల్లా డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య.. ఆ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాకేంద్రంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో శుక్రవారం నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా వారు ఎక్సైజ్ సూపరింటెండెంట్ నరసింహులుతో కలిసి ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఎక్సైజ్ సీఐలతో సమీక్ష నిర్వహించారు. పలు సూచనలు చేశారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ చంద్ర శేఖర్‌రెడ్డి, జిల్లా ఎక్సైజ్ అధికారి గోవిందనాయక్ పాల్గొన్నారు.

ఆరోగ్యవంత జనాభా.. దేశానికి ఆస్తి

● జిల్లా వైద్యాధికారి ఈబీ దేవి



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా వైద్యాధికారి

అనంతపురం వైద్యం, జూలై 11(ఆంధ్రజ్యోతి): భూములు, డబ్బు కంటే ఆరోగ్యవంతమైన జనాభా దేశానికి ఆస్తి అని జిల్లా వైద్యాధికారి ఈబీ దేవి పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ జనాభా దినం పురస్కరించుకుని నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీని జిల్లా వైద్యాధికారి జెండా ఊపి, ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రపంచ దేశాల్లో జనాభా తగ్గుదల మొదలైందన్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం జనాభా నిర్వహణకు పెద్దపీట వేస్తోందన్నారు. దంపతులు తప్పనిసరిగా సంతానం పొందాలన్నారు. తద్వారా భవిష్యత్తులో ఆరోగ్యవంతమైన యువ జనాభా పెరిగి, దేశాభివృద్ధికి తోడ్పడతారన్నారు.

రికార్డు సృష్టించారు

లక్ష్యానికి మించి హంద్రీనీవా లైనింగ్ పనులు

24 గంటల్లో 79వేల చదరపు మీటర్ల పనులు పూర్తి



కాంట్రాక్టర్లు, ఇంజనీర్లు, కార్మికులను అభినందిస్తున్న హంద్రీనీవా ఎస్ఈ రాజా స్వరూప్‌కుమార్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ లైనింగ్ పనుల్లో రికార్డు సృష్టించారు. అనుకున్న సమయం కంటే ముందుగానే లక్ష్యాన్ని సాధించి ఔరా అనిపించారు. శ్రీశైలం డ్యాం నుంచి మల్యాల వద్ద కృష్ణా జలాలను హంద్రీనీవాకు వదిలేలోపు కనీసం లైనింగ్ పనులు పూర్తి చేయాలని అధికారులు భావించారు. ఈక్రమంలోనే 24గంటల సమయంలో పూర్తి చేయాలని టార్గెట్ విధించుకున్నారు. రాత్రింబవళ్లు పని చేసిశారు. 7వేల క్యూబిక్ మీటర్ల స్టీల్ ఫైబర్ రెయిన్ హార్స్‌మెంట్ కాంక్రీట్‌తో 70వేల చదరపు మీటర్లు సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ పనులు పూర్తి చేయాలని నిర్ణయించినట్లు ఎస్ఈ రాజా స్వరూప్ కుమార్ పేర్కొన్నారు. గురువారం ఉదయం 6గంటల నుంచి శుక్రవారం ఉదయం 6గంటలలోపు పూర్తి చేయాలని నిర్దేశించినప్పటికీ శుక్రవారం ఉదయం 4గంటలకే 8వేల క్యూబిక్ మీటర్ల స్టీల్ ఫైబర్ రెయిన్‌హార్స్‌మెంట్ కాంక్రీట్‌తో 79వేల చదరపు మీటర్ల లైనింగ్ పూర్తి చేసినట్లు తెలిపారు. ఆర్‌వీఆర్-ఎల్‌సీసీ సంస్థ, బీఎస్ఆర్ ఇన్‌ఫ్రాటెక్, ఎస్ఆర్‌సీ ఇన్‌ఫ్రా డెవలపర్స్ సంస్థల కాంట్రాక్టర్లు, ఇంజనీర్లు, కార్మికులను జిల్లా జలవనరుల శాఖ ప్రాజెక్ట్‌ల సీఈ నాగరాజ, హంద్రీనీవా ఎస్ఈ రాజా స్వరూప్‌కుమార్‌లు అభినందించారు. అత్యాధునిక సాంకేతిక సహాయంతో 1385భారీ యంత్రాలను, 2945మంది కార్మికులు, ఇంజనీర్లను భాగస్వాములు చేసి ఈ రికార్డు సాధించినట్లు అధికారులు తెలిపారు.

నిద్రలో నిఘా..!

(5వ పేజీ తరువాయి)

పాల్పడుతున్నట్లు స్పష్టం అవుతోంది. సీసీ కెమెరాల్లో రికార్డు అయిన చోరీ దృశ్యాలను పరిశీలించిన పోలీసు అధికారులు ఇవి బయటిదొంగల పనిగా నిర్ధారణకు వచ్చినట్లు సమా చారం. నియోజవర్గంలోని పలు మండలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ దొంగతనాలు లెక్కలేనన్ని జరిగాయి. దొంగతనాలు వరుసగా జరుగుతున్నా పట్టించుకునే వారే లేరని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



గత నెలలో వైశ్యాబ్యాంక్ కాలనీలో కోసిన కిటికీ ఊచలు

నిఘా ఏదీ..?

పట్టణంలో శాంతి, భద్రతలకు భంగం కలుగకుండా పోలీసులు రక్షణగా ఉంటారు. ప్రమాదాలు, దొంగతనాలు, గొడవలు వంటి వాటిని ముందే అంచనా వేయడానికి పోలీసు శాఖ నిఘా విభాగాన్ని ఏర్పాటు చేసింది. అయితే ఆ నిఘా విభాగం కదిరిలో నిద్రపోతున్నట్లు ఉందని ప్రజలు విమర్శిస్తున్నారు. ఐడి పార్టీ, స్పెషల్ బ్రాంచ్‌తోపాటు ఇంటెలిజెన్స్ విభాగాలు ఉన్నా వరుసగా దొంగతనాలు జరుగుతుండటం ప్రజలకు ఆందోళన కలిగిస్తోంది. పట్టణంలో వరుస దొంగతనాలు, బస్టాండులో జేబు దొంగలు, గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్‌ల చోరీలు, హుండీ దొంగత నాలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. శివారు ప్రాంతాల్లో విశాలంగా ఉంటుందని ఇళ్లు కట్టుకుంటే దొంగల భయంతో కంటిమీద కునుకు లేకుండా ఉందని పేరు చెప్పడానికి భయపడిన ఓ ఉద్యోగి చెప్పారు. పోలీసులు నిఘా పెంచి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరతున్నారు.

దొంగల ఆచూకీ తెలిసింది..



కదిరిలో ఇటీవల జరిగిన దొంగతనాల్లో దొంగల అచూకీ తెలిసింది. మధ్యప్రదేశ్‌కు చెందిన వారిగా గుర్తించాం. వారిని పట్టుకునే ప్రయత్నంలో ఉన్నాం. ప్రజలు భయపడాల్సిన పనిలేదు. పోలీసులు రక్షణగా ఉన్నారు. దొంగతనాలు జరగకుండా నిఘా పెంచుతాము. - **శివనారాయణ స్వామి, డీఎస్పీ**

ఒకే రాత్రి మూడు చోరీలు

గాండ్లపెంట, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో గురువారం రాత్రి మూడు చోరీలు జరగడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. కదిరి, రాయచోటి ప్రధాన రహదారిలో ఉన్న నాగకుమారి టిఫిన్ సెంటర్ తాళాలు పగలకొట్టి గ్యాస్ సిలిండర్, మిక్సీ రెండు బియ్యం బస్తాలు, కూల్‌డ్రింక్‌లు చోరీ చేశారు. ఇదే దుకాణంలో ఇప్పటికి మూడుమార్లు చోరీలు జరిగాయి. ఎస్సీ కాలనీలో హసీనాబీ ఇంటి తాళాలు పగలకొట్టి బీరువాలోని ఐదుతులాల బంగారం, వెండి నగలు చోరీ చేశారు. తూపల్లి రహదారిలోని సుబహాన్ టైలర్ దుకాణం తాళాలు పగలకొట్టి దుస్తులు చోరీ చేశారు. మరి కొన్ని ఇళ్లలో బయట ఉన్న వస్తువులు చోరీ చేసినట్లు చెప్పారు. ఎస్ఐలు వలీబాషా, మగ్బుల్ బాషా, సీఐ నాగేంద్ర చోరీ ప్రాంతాలను పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీమ్‌తో ఆధారాలు సేకరించారు.



గాండ్లపెంటలో బీరువా పగులకొట్టిన దొంగలు

అదుపు తప్పిన ప్రైవేటు స్కూల్ బస్సు

● విద్యార్థులంతా క్షేమం



ప్రమాదానికి గురైన బస్సు

కూడేరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పేరు గ్రామ సమీపంలో శ్రీ సంగమేశ్వర ప్రైవేటు స్కూల్‌కు చెందిన బస్సు శుక్రవారం అదుపు తప్పి రోడ్డు పక్కనున్న గుంతలోకి దూసుకెళ్లింది. దీంతో బస్సులో ఉన్న విద్యార్థులు భయంతో వణికిపోయారు. మండల కేంద్రంలోని పాఠశాలకు పి.నాగిరెడ్డిపల్లి, ఇప్పేరు గ్రామాల నుంచి దాదాపు 50 మంది విద్యార్థులను బస్సులో ఎక్కించుకున్నారు. ఇప్పేరు దాటిన తర్వాత మలుపు వద్దకు రాగానే స్టీరింగ్ రాడ్ కట్ కావడంతో బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలోకి దూసుకెళ్లింది. అయితే బస్సులో ఉన్న విద్యార్థులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో విద్యుత్ లైన్లు ఉన్నాయని, జరగరానిది జరిగి ఉంటే ఎవరిది బాధ్యత అని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘటన స్థలాన్ని సీఐ రాజు పరిశీలించారు. కండిషన్ లేని బస్సులో విద్యార్థుల ను ఎలా తరలిస్తారని పాఠశాల యాజమాన్యాన్ని ప్రశ్నించారు. ప్రమాదానికి గురైన బస్సును స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న పాఠశాల యాజమాన్యం విద్యార్థులను మరో బస్సులో తరలించారు.

జాతీయ స్థాయిలో సర్పంచు సత్తా



హనుమంతరెడ్డి

కూడేరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పి. నారాయణపురం సర్పంచు హనుమంతరెడ్డి జాతీయ స్థాయిలో ఘనత సాధించారు. సర్పంచ్ సంవాద్ పోటీల్లో రెండో స్థానం సాధించారు. భారత నాణ్యతా మండలి దేశంలోని సర్పంచులను ఒకే వేదికపైకి తెచ్చేందుకు సర్పంచ్ సంవాద్ పేరిట మొబైల్ అప్లికేషన్ ప్రవేశపెట్టింది. మెరుగైన పాలన, గ్రామాభివృద్ధి, సమన్వయం, సాంకేతికత, సమాచారం మార్పిడి దీని ముఖ్య ఉద్దేశ్యం. ఈక్రమంలోనే ప్రతి నెలా సర్పంచులకు పోటీలు నిర్వహిస్తూ, ప్రోత్సాహక బహుమతులు అందజేస్తోంది. జూన్ నెలకు సంబంధించి గ్రామాభివృద్ధి భవిష్యత్తు ఆలోచనలపై నిర్వహించిన పోటీలకు తాను పంపిన వీడియోకు జాతీయ స్థాయిలో తనకు రెండో స్థానం దక్కినట్లు సర్పంచు హనుమంతరెడ్డి తెలిపారు. నగదు ప్రోత్సహం కింద రూ. 25 వేలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

వర్సిటీలో ఉద్యోగుల గొడవ..!

అనంతపురం రూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూలో ఇద్దరు ఉద్యోగులు వ్యక్తిగత కారణాలతో గొడవ పడ్డారు. వర్సిటీలోని ఓ విభాగం వద్ద రెండురోజుల కిందట టైం స్కేల్ ఉద్యోగి నాగలింగం, డైలీ వేజ్ ఉద్యోగి పూల సాయికుమార్ మధ్య మాటామాటా పెరిగి, దాడి చేసుకున్నారు. దీనిపై నాగలింగం.. ఇటుకలపల్లి పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎస్కేయూ వీసీ, రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేశాడు. తాను పనిమీద ఫిజిక్స్ డిపార్ట్మెంట్‌కు వెళ్లగా అక్కడే అటెండర్‌గా పనిచేస్తున్న సాయికుమార్ అసభ్య పదజాలంతో దూషిండడంతోపాటు దాడి చేశాడన్నారు. తోటి ఉద్యోగులు విడిపించారన్నాడు. పొలం తగాదాను మనసులో పెట్టుకుని, తనపై దాడి చేసినట్లు తెలిపాడు. తన సోదరి ఇటుకలపల్లికి వెళ్లేందుకు రూడ్ సెట్ వద్ద ఆటో కోసం వేచి చూస్తుండగా సాయికుమార్ బైక్‌తో ఢీకొట్టి వెళ్లిపోయాడని ఆరోపించాడు. ఆమెను ఆస్పత్రిలో చేర్పించి, పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. వర్సిటీలో సదరు ఉద్యోగుల మధ్య గొడవకు సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది.

వడ్డీ వ్యాపారులు వేధిస్తున్నారని..!



వీడియోలో మహబూబ్‌బాషా

అనంతపురం క్రైం, జూలై 11(ఆంధ్రజ్యోతి): వడ్డీ వ్యాపారులు వేధిస్తున్నారని, తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని బుక్కరాయసముద్రానికి చెందిన మహబూబ్ బాషా అనే వ్యక్తి సెల్ఫీ వీడియో పెట్టాడు. అనంతరం విష రసాయనం తాగాడు. కుటుంబ సభ్యులు బాధితుడిని జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటన నగర శివారులోని రాజీవ్ కాలనీలో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన మేరకు, మహబూబ్ బాషా కలెక్టరేట్ సమీపంలోని ఓ టీ స్టాల్‌లో పనిచేస్తున్నాడు. రామాంజి అనే వ్యక్తి నుంచి వడ్డీకి అప్పు తీసుకున్నాడు. రాజీవ్ కాలనీలోని తన చెల్లెలి ఇంటికి శుక్రవారం ఉదయం వెళ్లాడు. వడ్డీ డబ్బుల కోసం తనను వేధిస్తున్నారని, అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నానని విషాన్ని తాగుతూ సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. వడ్డీ కట్టలేమని, అసలు కడతామని చెప్పినా రామాంజి భార్య వినలేదని మహబూబ్ బాషా భార్య ఆవేదన వ్యక్తం చేశారు. ఇల్లు ఖాళీ చేసి అప్పగించాలని, లేదంటే ఇల్లు అమ్మి డబ్బులు కట్టాలని ఒత్తిడి తెచ్చిందని వాపోయారు. మొదట రూ.10 వడ్డీ అన్నారని, ఆ తర్వాత రూ.5 వడ్డీకి వచ్చారని అన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో ఆత్మహత్య

పుట్టపర్తిరూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని బీడుపల్లికి చెందిన మహేంద్ర(33) అప్పుల బాధతో శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. మహేంద్ర రజక వృత్తి చేసుకుని కుటుంబాన్ని పోషించుకునేవాడు. వృత్తి పనులు గిట్టుబాటు కాకపోవడంతో కుటుంబ పోషణ కోసం అప్పులు చేశాడు. వాటిని తీర్చేమార్గంలేక ఇంట్లో ఉరి వేసుకున్నాడు. మహేంద్రకు భార్య నందిని, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. అర్బన్ సీఐ సునీత దర్యాప్తు చేస్తున్నారు.

పందిని ఢీకొన్న ద్విచక్రవాహనం

వృద్ధురాలి మృతి

హిందూపురం, జూలై11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మోతుకపల్లి వద్ద పందిని ద్విచక్రవాహనం ఢీకొనడంతో కాంతమ్మ(70) మృతిచెందింది. పరిగి మండలం పెద్దరెడ్డిపల్లికి చెందిన కాంతమ్మ వరుసకు అల్లుడైన ఉమాశంకర్‌తో కలిసి ద్విచక్రవాహనంలో హిందూపురం నుంచి పెద్దరెడ్డిపల్లికి బయల్దేరింది. మోతుకపల్లి వద్దకు రాగానే పంది అడ్డు రావడంతో ద్విచక్రవాహనం ఢీకొని అదుపుతప్పి కిందపడ్డారు. దీంతో కాంతమ్మ అక్కడికక్కడే మృతిచెందగా.. ఉమాశంకర్‌కు గాయాలయ్యాయి. ప్రమాదంపై ఫిర్యాదు అందలేదని వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

మా పాలనలో రెండింతల అభివృద్ధి

ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్



మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్, వేదికపై ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తదితరులు

కణేకల్లు, జూలై 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో కుంటుపడిన అభివృద్ధిని రెండింతలు చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని రాష్ట్ర ఆర్థికశాఖమంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. మండలంలోని యర్రగుంట గ్రామంలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన సుపరిపాలనలో తొలిఅడుగు బహిరంగ సభలో మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో తల్లికి వందనం పథకం కింద రూ. 10వేల కోట్లను తల్లుల ఖాతాల్లో జమ చేశామన్నారు. హంద్రీనీవా కాలువ అభివృద్ధికి రూ.3800 కోట్లు కేటాయించి రాయలసీమను సస్యశ్యామలం చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. హెచ్చెల్సీ మరమ్మతులకు రూ.35 కోట్లు కేటాయించి పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. అన్నదాత సుఖీభవ సొమ్మును రైతుల ఖాతాల్లో జమ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. చెత్తపన్ను, ల్యాండ్ టైటిలింగ్‌ను రద్దు చేసి రైతులు, ప్రజలకు పన్నుల నుంచి ఉపశమనం కలిగించామన్నారు. రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి జగన్ లాంటి భూతాన్ని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా జగన్ పార్టీ కుట్రపూరిత చర్యలకు పాల్పడుతోందన్నారు. తనకు ఉరవకొండ, రాయదుర్గం ప్రాంతాలు రెండు కళ్లు అన్నారు. రాష్ట్రానికి తాను మంత్రి అయినప్పటికీ జిల్లాకు మాత్రం మొదటి కూలీగా పని చేస్తానన్నారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ తాను రాయదుర్గం నియోజక అభివృద్ధికి నిధులు అడిగిన వెంటనే మంత్రి పయ్యావుల కేశవ్ సానుకూలంగా స్పందించడం హర్షనీయమన్నారు. అనంతరం రూ. 1.70 కోట్లతో నిర్మించిన పీహెచ్‌సీ కేంద్రాన్ని వారు ప్రారంభించారు. హెచ్చెల్సీ మరమ్మతుల్లో భాగంగా 137 కి.మీ. వద్ద జరుగుతున్న అండర్ టన్నెల్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ ఛైర్మన్ హనుమంతరెడ్డి, డీఎంహెచ్ఓ ఈబీదేవి, హెచ్చెల్సీ ఎస్ఈ విశ్వనాథ్‌రెడ్డి, టీడీపీ నాయకులు వన్నారెడ్డి, రమేష్‌రెడ్డి, తిప్పారెడ్డి, లాలెప్ప, ఆనంద్‌రాజ్, ఆది, కోళేకుర్తి సుదర్శన్, బసవరాజు, బీటీ రమేష్, షేక్‌ముజ్జు, బాయినేని నవీన్, మారుతి పాల్గొన్నారు.

మామే సూత్రధారి..!

● వివాహేతర సంబంధం, భూమి విషయంలో వివాదం ● రూ.నాలుగు లక్షల సుపారీ
● ముదిగుబ్బ శివారులో హత్య ● ఐదుగురు నిందితుల అరెస్టు



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ హేమంత్‌కుమార్

ధర్మవరం, జూలై 11(ఆంధ్రజ్యోతి): ముదిగుబ్బలో జరిగిన హత్యకు సంబంధించి మృతుడి మామే సూత్రధారి అని పోలీసులు వెల్లడించారు. ఈ హత్య కేసులో నిందితులైన ఐదుగురిని అరెస్టు చేసినట్లు ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఆయన అరెస్టు వివరాలను వెల్లడించారు. ఈనెల మూడో తేదీ ముదిగుబ్బ శివారు చిన్నబుడ్డంగుట్టవద్ద గల పొలంలో ఓ వ్యక్తి మొండెం కనిపించింది. గమనించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సీఐ శివరాముడు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అక్కడ లభించిన సెల్‌ఫోన్ ఆధారంగా మృతుడి వివరాలు సేకరించారు. మృతుడిని తనకల్లు మండలం ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన విశ్వనాథ్‌గా గుర్తించారు. ప్రస్తుతం ఆయన కదిరి శివాలయం వీధిలో కాపురం ఉంటున్నట్లు తెలుసుకున్నారు. మృతుడు విశ్వనాథ్ భార్య శ్యామల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. తర్వాత విశ్వనాథ్ ఫోన్ కాల్ డేటా ఆధారంగా అనుమానితులైన బత్తలపల్లి మండలం గరిశనపల్లికి చెందిన కమతం కాటమయ్య, యర్రాయపల్లికి చెందిన సాకే మధుబాబు, కమతం రామకృష్ణ, ఓడీసీ మండలం గాజుకుంటపల్లికి చెందిన బెట్టకుంట వెంకటరమణప్ప, శెట్టివారిపల్లికి చెందిన మంకముతక శంకరను గురువారం సాయంత్రం ముదిగుబ్బ మండలం రాళ్ల అనంతపురంక్రాస్ వద్ద అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. వారి నుంచి మూడు వేటకొడవళ్లు, ఒక ఆటో, మొబైల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని, కోర్టులో హాజరపరిచామన్నారు.

హత్యకు నేపథ్యం ఇదీ..

మృతుడు విశ్వనాథ్‌కు 20 ఏళ్ల కిందట ఓబుళదేవరచెరువు మండలం గాజుకుంటపల్లికి చెందిన బెట్టకుంట వెంకటరమణ పెద్దకుమార్తె శ్యామలతో వివాహం అయింది. అయితే మృతుడు తన మరదలితో వివాహేతర సంబంధం పెట్టుకోవడం, తన అత్త పేరిట ఉన్న విలువైన భూములు అమ్ముకోవడంతో మామ వెంకటరమణతో వివాదం ఏర్పడింది. దీంతో వెంకటరమణ అల్లుడిపై కక్ష పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో విశ్వనాథ్‌ను హత్య చేయడానికి కమతం కాటమయ్యకు రూ.4లక్షలకు సుపారీ ఇచ్చాడు. మధ్యవర్తిగా మంకముతక శంకర వ్యవహరించాడు. కాటమయ్య కొన్ని నెలల నుంచి విశ్వనాథ్‌తో పరిచయం పెంచుకుని చనువుగా ఉండేవాడు. ఈ క్రమంలో రూ.50 వేలు అవసరం ఉంది, సర్దుబాటు చేయాలని కాటమయ్యను విశ్వనాథ్ అడిగాడు. దీంతో ముదిగుబ్బకు రమ్మని కాటమయ్య చెప్పాడు. ముందస్తు పథకం ప్రకారం కాటమయ్య, మరో ఇద్దరు ఆటో డ్రైవర్లు కమతం రామకృష్ణ, సాకే మధుబాబులతో కలిసి మృతుడు విశ్వనాథ్‌ను ముదిగుబ్బ శివారు అటవీ ప్రాంతంలోకి మద్యం సేవించడానికి తీసుకెళ్లారు. అక్కడ విశ్వనాథ్‌ను కొడవళ్లతో నరికి హత్య చేశారు. తల మొండెం వేరు చేసి పారేసి వచ్చిన ఆటోలోనే పారిపోయినట్లు డీఎస్పీ వివరించారు.

అయ్యో.. పాపం..!

బీటీపీలో మునిగి బావబామ్మర్ది మృతి

సరదాగా చేపల వేటకెళ్లగా ప్రమాదం

కుటుంబంలో విషాదం



జబీవుల్లా



మన్సూర్

గుమ్మఘట్ట, జూలై 11(ఆంధ్రజ్యోతి): చేపల వేట సరదా బావబామ్మర్దిని బలిగొంది. మండలంలోని భైరవానితిప్ప ప్రాజెక్టు (బీటీపీ)లో మునిగి జబీవుల్లా(30), మన్సూర్ (38) శుక్రవారం మరణించారు. గుమ్మఘట్ట ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్ణాటకలోని మొలకల్మూరు తాలూకా రాంపురం గ్రామానికి చెందిన జబీవుల్లా కార్పెంటర్. అతడికి రాయదుర్గం పట్టణానికి చెందిన గుల్జార్‌బానుతో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలున్నారు. నెల రోజుల క్రితమే గుల్జార్‌బాను మగ బిడ్డకు జన్మనిచ్చింది. కుటుంబంలో సంతోషం నెలకొంది. గుల్జార్‌బాను పుట్టింట్లోనే ఉంది. ఈ నేపథ్యంలో జబీవుల్లా వారం రోజుల క్రితం మొహర్రం పండుగకు రాయదుర్గానికి వచ్చాడు. రాయదుర్గానికే చెందిన బామ్మర్ది మన్సూర్‌తో కలిసి బైక్‌పై శుక్రవారం సరదాగా బీటీపీలోకి చేపల వేటకు వెళ్లాడు. డ్యాం డిస్ట్రిబ్యూటరీ వద్ద గేలం వేస్తుండగా.. ప్రమాదవశాత్తు ఇద్దరూ నీటిలో పడిపోయారు. ఈత రాకపోవడంతో ఊపిరాడక మరణించారు. కాసేపటికి అటుగా వెళ్లిన మత్స్యకారులు.. గట్టుపై బైక్, చెప్పులు ఉండడాన్ని గుర్తించారు. మనుషులెవరూ కనిపించలేదు. అనుమానం వచ్చి వల విసిరారు. ఒకరి మృతదేహం లభించింది. వెంటనే వారు.. పోలీసులకు సమాచారం అందించారు. సిబ్బందితో కలిసి ఎస్ఐ ఈశ్వరయ్య ప్రమాద స్థలానికి చేరుకుని, పరిశీలించారు. మరోసారి వల వేయగా.. మరో మృతదేహం బయటపడింది. వారి జేబుల్లోని ఆధార్ కార్డులోని వివరాల మేరకు కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతదేహాలను రాయదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా, మన్సూర్ బేల్దారి పనులకు వెళ్తుండేవాడు. అతడికి భార్య తబ్, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఒకే కుటుంబంలో ఇద్దరు మృతిచెందడంతో బంధువులు, కుటుంబసభ్యులు ఆసుపత్రి వద్ద బోరున విలపించారు.

దేవాలయ భూములను పరిరక్షించండి

జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కలెక్టరేట్, జూలై 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో దేవాలయాల భూములు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్.. సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి భూసంరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో దాదాపు 2,903 ఎకరాల వరకు దేవాలయ భూములు ఆక్రమణలో ఉన్నాయన్నారు. వాటిని పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని దేవాలయాల భూములను లీజుకిచ్చేలా చూడాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ, దేవదాయ అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరెడ్డి, డీఆర్వో మలోల, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

డెంగీతో బాలింత మృతి

అనంతపురం వైద్యం, గార్లదిన్నె జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరుకు చెందిన రెండు నెలల బాలింత షేక్ చాందిని(23) డెంగీతో శుక్రవారం మృతిచెందింది. ఆమె కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుక్కరాయ సముద్రం మండలం పి.కొత్తపల్లికి చెందిన షేక్ చాందినికి ఏడాదిన్నర క్రితం కల్లూరు వాసి షేక్ సాదిక్‌తో వివాహమైంది. వీరికి రెండుల నెలల బాబు ఉన్నాడు. ఈనెల 6న చాందినికి జ్వరం రావడంతో పామిడి ప్రభుత్వాస్పత్రిలో చూపించారు. తర్వాత అనంతపురంలోని కిమ్స్ సవీరా ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ రక్తపరీక్షలు నిర్వహించి, డెంగీగా నిర్ధారించిన డాక్టర్లు రెండు రోజులపాటు చికిత్సలు అందించారు. పరిస్థితి విషమించి శుక్రవారం మధ్యాహ్నం చాందిని మృతిచెందింది. ఆమె భర్త సాదిక్ కూలి పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. చాందిని మృతితో రెండు నెలల పసివాడు.. తల్లిలేని వాడయ్యాడు.

కళ్లలో కారం చల్లి.. కత్తితో నరికేశాడు

తన భార్యతో చనువుగా ఉన్నాడని చంపేసిన భర్త



నవీన్ (ఫైల్)

కదిరి అర్బన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బండవారిపల్లిలో నవీన్ (36) అనే వ్యక్తిని అదే గ్రామానికి చెందిన విశ్వనాథ్ హత్య చేశాడు. బహిర్భూమి కోసం శుక్రవారం తెల్లవారుజామున గ్రామ శివారుకు వెళ్లిన నవీన్‌ను వెంబడించి, కళ్లలో కారం చల్లి.. కత్తితో నరికేశాడు. పోలీసులు తెలిపిన మేరకు, విశ్వనాథ్ భార్యతో నవీన్ చనువుగా ఉండేవాడు. ఆమెకు సెల్‌ఫోన్‌లో మెసేజ్‌లు పెట్టేవాడు. దీంతో అనుమానం పెంచుకున్న విశ్వనాథ్.. ఈ హత్య చేశాడు. నవీన్ భార్య మూడేళ్ల క్రితం ఆత్మహత్య చేసుకున్నారు. వీరికి ఇద్దరు కూతుళ్లు సాయి, పూజిత, కుమారుడు హర్షవర్ధన్ ఉన్నారు. కూతుళ్లు కదిరి కేజీబీవీలో, కుమారుడు అదే గ్రామంలో చదువుతున్నారు. తల్లి లేని చిన్నారులు.. ఈ హత్యతో తండ్రిని కూడా కోల్పోయారు. తండ్రి మృతదేహం వద్ద కన్నీరుమున్నీరుగా విలపించారు. హతుడి తండ్రి రాఘవయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కదిరి అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చార్జీలు తగ్గాయ్..

ఆర్టీసీ వెన్నెల, ఇంద్ర బస్సుల టిక్కెట్ రేట్ల తగ్గింపు: ఆర్ఎం

అనంతపురం టౌన్, జూలై11(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఆర్టీసీ వెన్నెల ఏసీ స్లీపర్, ఇంద్ర బస్సుల్లో టిక్కెట్ ధరలను తగ్గించినట్లు రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని శుక్రవారం ప్రకటనలో వెల్లడించారు. ఏసీ వెన్నెల స్లీపర్ బస్సుల్లో 20శాతం, ఇంద్ర బస్సుల్లో 15 శాతం టిక్కెట్ ధరలు తగ్గించామన్నారు. కొత్త ధరలు ఈనెల 31 వరకు అమలులో ఉంటాయన్నారు.

రూట్ల వారీగా తగ్గించిన ధరల వివరాలు

రూట్	ప్రస్తుత టికెట్ ధర	తగ్గింపు టికెట్ ధర
తాడిపత్రి - హైదరాబాద్ (వెన్నెల)	1105	884
అనంతపురం - విజయవాడ (ఇంద్ర)	961	817
అనంతపురం - చెన్నై (ఇంద్ర)	832	708
అనంతపురం - తిరుపతి (ఇంద్ర)	579	493

నెల్లూరుకు భారీ విజయం

గెలుపు బాటలో అనంత జట్టు... ఉత్సాహంగా మల్టీ డే క్రికెట్ పోటీలు



కమిల్



సుబ్రహ్మణ్యం



మాధవ్‌నాయుడు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 11(ఆంధ్రజ్యోతి): నగరంలోని అనంత క్రీడా గ్రామంలో జరుగుతున్న సీనియర్ మల్టీ డే క్రికెట్ పోటీలలో అనంత జట్టు గెలుపు బాటలో ఉంది. నెల్లూరు జట్టు ఇన్నింగ్స్ 59 పరుగుల తేడాతో చిత్తూరు జట్టుపై విజయం సాధించింది. నాలుగో రౌండ్ పోటీసులు శుక్రవారం రెండోరోజు కొనసాగాయి. రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో అనంతపురం-కర్నూలు జట్లు తలపడ్డాయి. మొదటి ఇన్నింగ్స్‌లో అనంతపురం జట్టు 54 ఓవర్లలో 267 పరుగులకు ఆలౌట్ అయ్యింది. కర్నూలు మొదటి ఇన్నింగ్స్ 109/4తో రెండో రోజు బ్యాటింగ్ కొనసాగించి.. 49.3 ఓవర్లలో 178 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంత బౌలర్లు కమిల్ 5 వికెట్లు, వినయ్‌కుమార్ 3, ప్రమోద్‌కుమార్ 2 వికెట్లు తీశారు. రెండో ఇన్నింగ్స్‌లో అనంతపురం జట్టు 45.5 ఓవర్లలో 204 పరుగులకు ఆలౌట్ అయ్యింది. గిరినాథ్ రెడ్డి 54 పరుగులు, రాజు కుళ్ళాయప్ప 49 పరుగులు సాధించారు. కర్నూలు బౌలర్లు ఆంజనేయులు 6 వికెట్లు, ఇస్మాయిల్ 2 వికెట్లు తీశారు. అనంతరం 293 పరుగల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన కర్నూలు, రెండో రోజు ఆట ముగిసే సమయానికి 26 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 132 పరుగులు చేసింది. అనంత జట్టు మరో ఐదు వికెట్లు తీస్తే విజయం సొంతమౌతుంది.

సుబ్రహ్మణ్యం భారీ సెంచరీ..

అనంతపూర్ క్రికెట్ గ్రౌండ్‌లో చిత్తూరు-నెల్లూరు జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. మొదటి ఇన్నింగ్స్‌లో చిత్తూరు 23.3 ఓవర్లలో 124 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఓవర్‌నైట్ స్కోర్ 215/4తో రెండో రోజు ప్రారంభించిన నెల్లూరు జట్టు.. 83.1 ఓవర్లలో 413 పరుగులకు ఆలౌట్ అయ్యింది. మొదటి రోజు రేవంత్ రెడ్డి సెంచరీ చేయగా, రెండో రోజు సుబ్రమణ్యం 216 బంతుల్లో 21 బౌండరీలు, రెండు సిక్సర్లతో 160 పరుగులు చే శాడు. చిత్తూరు బౌలర్ మాధవ్ రాయుడు 5 వికెట్లు, దీపన్ సాయినాథ్, సూర్యచరణ్ చెరో 2 వికెట్లు తీశారు. రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించిన చిత్తూరు, రెండో రోజు 49.2 ఓవర్లలో 230 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దీంతో నెల్లూరు జట్టు ఇన్నింగ్స్ 59 పరుగుల తేడాతో విజయం సొంతం చేసుకుంది. అనంతపురం జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రకాష్‌రెడ్డి, భీమలింగారెడ్డి పోటీలను పర్యవేక్షించారు.

అక్రమార్కులపై కొరడా

ఏడీసీసీ బ్యాంకు ఆత్మకూరు శాఖలో అవినీతిపై చర్యలు

నలుగురు అధికారుల సస్పెన్షన్... ఒకరికి షోకాజ్ నోటీసు

బోర్డు పాలకవర్గ సమావేశంలో తీర్మానం



అధికారులతో చర్చిస్తున్న ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ కేశవరెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 11(ఆంధ్రజ్యోతి): అక్రమార్కులపై ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి కొరడా ఝులిపించారు. ఆత్మకూరు బ్రాంచ్‌లో బోగస్ పట్టాలతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి రూ.20లక్షల రుణాలు చెల్లించిన వ్యవహారంలో నలుగురు అధికారులపై సస్పెన్షన్ వేటు వేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన బోర్డు పాలకవర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఆత్మకూరు బ్రాంచ్‌లో 2016లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి రూ.20లక్షలు బోగస్ పట్టాలపై రుణాలిచ్చారు. ఇందులో కీలకంగా వ్యవహరించిన మేనేజర్‌స్థాయి అధికారులు రాజేంద్రప్రసాద్, నరసింహమూర్తి, నాగార్జున, సూపర్‌వైజర్ అరుణకుమారిని సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఏజీఎం స్థాయి అధికారి డీకే దుర్గాప్రసాద్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ... తీవ్రస్థాయిలో మందలించారు. ఈ వ్యవహారంలో మరో ఇద్దరు ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న ఉన్నతాధికారులను కూడా హెచ్చరించినట్లు సమాచారం. వంక పోరంబోకు స్థలానికి బోగస్ పట్టాలతో రూ.20 లక్షలు చెల్లించిన రుణాలు ప్రస్తుతం రూ.50లక్షల వరకు అయినట్లు చెబుతున్నారు. ఇలాంటి ఘటనలు బ్యాంకులో, సొసైటీల్లో పునరావృతం కాకుండా కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పదని తీర్మానించారు. బ్యాంకు ప్రతిష్టను కాపాడుతూ, రైతులకు, ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడంపైనే పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని చైర్మన్.. అధికారులకు సూచించారు. సమావేశంలో ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖారాణి, ఆప్కాబ్ నోడల్ అధికారి సురేంద్ర, రెండు జిల్లాల సహకార శాఖాధికారులు అరుణకుమార్, కృష్ణానాయక్, నాబార్డు డీడీఎం అనురాధ పాల్గొన్నారు.

15 నుంచి గ్రామ సభలు

అనంతపురం న్యూటౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈనెల 15 నుంచి 25వతేదీ వరకు గ్రామసభలు నిర్వహించాలని జడ్పీ సీఈఓ శివశంకర్.. ఎంపీడీఓలను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామసభల్లో ఇప్పటికే గుర్తించిన బంగారు కుటుంబాలకు సంబంధించిన జాబితాను పరిశీలించాలన్నారు. వ్యత్యాసాలు ఉంటే సరిదిద్దాలని ఆదేశించారు.

న్యూస్ బాక్స్

బాబాకు లక్ష కుసుమార్చన


పూజలు అందుకున్న బాబా

ధర్మవరం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాయినగర్‌లో వెలసిన షిర్డీ సాయిబాబా ఆలయంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న గురుపౌర్ణమి వేడుకలు శుక్రవారం ముగిశాయి. శుక్రవారం ఉదయం బాబాకు అభిషేకం, లక్ష కుసుమార్చన తదితర పూజాకార్యక్రమాలు నిర్వహించారు. అన్న దానం చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు వీరనారాయణ, నారాయణరెడ్డి, బంధనాధం సూర్యప్రకాశ్, జేసీ నాయుడు, రామలింగయ్య, సూర్యనారాయణ పాల్గొన్నారు.

జామియా మసీదు పట్టణ కమిటీ ఏకగ్రీవం


ఎంపికైన కమిటీ సభ్యులు

ధర్మవరం, జూలై 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జామియా మసీదు పట్టణ నూతన కమిటీని మతపెద్దల సమక్షంలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎంపికచేశారు. ముతవల్లిగా ఎస్ఆర్‌టీ రహంతుల్లా, వైస్ ముతవల్లిగా నడిం మసీదు అమానుల్లా, ప్రధాన కార్యదర్శిగా నడింమసీదు షారూక్, కార్యదర్శిగా నడిం మసీదు ఇస్మాయిల్, కోశాధికారిగా షర్ఫుద్దీన్ హజరత్‌ను ఏక గ్రీవంగా ఎంపిక చేశారు. సభ్యులుగా జావిద్, నడింమసీదు రియాజ్, ఇమ్రాన్, కృష్ణాపురం షెక్షావలి, షబ్బీర్, వెల్డింగ్ అమానుల్లా, గోల్డ్ అల్లా బకాష్, నయాజ్, తాడిమర్రి జాకీర్, కార్పెంటర్ ఫారూక్, గాలిబ్, సాలెహ్, సిల్క్ నూర్‌ను ఎంపికచేశారు. ఈ సమావేశంలో మతపెద్దలు నాగూర్‌హుస్సేన్, ఖాదర్‌సాబ్, నడింమసీదు అస్లాం, అబ్దుల్ మునాఫ్, రాళ్లపల్లి షరీప్, అల్తాప్, బుల్లెట్ బాషా పాల్గొన్నారు.

స్టాక్ ఉన్నంత వరకు విక్రయించాలి : ఏఓ

నంబులపూలకుంట, జూలై 11(ఆంధ్రజ్యోతి): స్టాక్ ఉన్నంత వరకు ఎరువుల దుకాణాల్లో రైతులకు కావాల్సిన ఎరువులు విక్రియించాలని ఏఓ లోకేశ్వరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రం లోని గ్రోమోర్ ఫర్టిలైజర్ దుకాణంలో యూరియా ఉన్నా విక్ర యించడం లేదని పలువురు రైతులు ఏఓకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన శుక్రవారం ఆ దుకాణాన్ని పరిశీలించారు. బయో మెట్రిక్ వల్ల ఇవ్వలేకపోయామని దుకాణం నిర్వాహకులు తెలిపారు.

వేతన బకాయిలు చెల్లించాలి: సీపీఐ

ముదిగుబ్బ, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలో తాగునీటి పథకం కింద పనిచేస్తున్న కార్మికులకు వెంటనే వేతన బకాయిలు చెల్లించాలని సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఆర్‌డబ్ల్యూఎస్ కార్మికులకు గత పది నెలలుగా జీతాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గత్యంతరం లేక మూడురోజులుగా సమ్మె బాట పట్టాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారుఆర్‌డబ్ల్యూఎస్ కార్మికులకు పది నెలల జీతాలు, సత్యసాయి కార్మికులకు నాలుగు నెలల జీతాలు బకాయి పడ్డట్లు తెలిసిందన్నారు. వెంటనే చెల్లించకపోతే సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామన్నారు.

సీపీఎం జిల్లా మహాసభల కరపత్రాల విడుదల

కదిరి అర్బన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈనెల 27, 28 తేదీల్లో జరిగే సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్ర వారం మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. సీపీఎం నాయ కులు జీఎల్ నరసింహులు, బాబ్‌జాన్, సాంబశివ, జగన్మోహన్, ముస్తాక్, రామమోహన్, రఫీక్, బడా సుధాకర్‌రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఖర్చు బారెడు.. రికవరీ మూరెడు


ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

ఓబుళదేవరచెరువు, జూలై 11(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి పథకంలో సామాజిక తనిఖీ వ్యవహారం ఖర్చు బారెడు, రికవరీ మూరెడు అన్న విధంగా ఉంది. మండలంలోని ఎస్సీ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ ఆవరణంలో శుక్రవారం సామాజిక తనిఖీ బహిరంగ ప్రజావేదికను ఎంపీడీఓ శివరామప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలో 2024-25కు గాను రూ. 11,72,10,974 వ్యయంతో పనులు చేశారు. ఇందులో ఉపాధి హామీ పథకం కింద రూ. 1. 40 లక్షలు, పంచాయతీరాజ్ కింద రూ.7వేలు మాత్రమే రికవరీకి అధికారులు ఆదేశించారు. ఇదిలా ఉండగా సామాజిక తనిఖీ బృందానికి రూ. 1.87లక్షలు ఖర్చు చేశారు. దీంతో ఈ రికవరీ కొండను తవ్వి ఎలుకను పట్టిన విధంగా ఉందని పలువురు అంటున్నారు. ఈ కార్యక్రమంలో పీడీ విజయేంద్రప్రసాద్, అబుడ్స్‌మన్ వెంకటశివారెడ్డి, ఏపీడీ జ్యోతి, రాష్ట్ర టీమ్ లీడర్ లోకేష్‌రెడ్డి, ఎంపీపీ ఫర్వీన్‌బాను, ఎస్ఆర్‌పీ నీలకంఠ, విజిలెన్స్ అధికారి నాగేశ్వరరావు, ఏపీఓ మంజుల సుధాకర్, డీఆర్‌పీలు, టెక్నికల్, పంచాయతీరాజ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించాలని విద్యార్థుల వినతి


తహసీల్దార్ రామనాథ్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న విద్యార్థులు

అమడగూరు, జూలై 11(ఆంధ్రజ్యోతి): తమ సమస్య పరిష్కరించాలంటూ మండలంలోని ఎ. కొత్తపల్లి, పుట్లవాండ్లపల్లి నుంచి మండలకేంద్రంలోని పాఠశాలకు వెళ్లే విద్యార్థులు శుక్రవారం తహసీల్దార్ రామనాథ్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లే విద్యార్థుల కోసం చినగానిపల్లి నుంచి పుట్లవాండ్లపల్లి, ఎ.కొత్తపల్లి మీదుగా ఆర్టీసీ బస్సు నడుస్తోంది. అయితే కొత్తపల్లిలో కొంతమంది రోడ్డుపై నిర్మాణాలు చేపట్టడంతో బస్సు ఆదారిలో పోవాలంటే ఇబ్బందిగా ఉందని డ్రైవర్ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు తెలిపాడు. ఇలాఉంటే బస్సు నడపలేమన్నారు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అమడగూరుకు వెళ్లి తహసీల్దార్‌కు విన్నవించారు. సర్వే చేయించి ఆక్రమణలు జరిగి ఉంటే తొలగిస్తామని, విద్యార్థులకు సమస్య లేకుండా చేస్తామని తహసీల్దార్ తెలిపారు.

దిగజారుతున్న శాంతిభద్రతలు

- సబ్ డివిజన్ పరిధిలో పెరిగిన హత్యలు, హత్యాయత్నాలు
- పోలీస్ స్టేషన్ పక్కనే పేకాడుతున్నా పట్టించుకోని వైనం



కదిరి, జూలై 11(ఆంధ్రజ్యోతి): కదిరి సబ్‌డివిజన్‌లో శాంతిభద్రతలు నానాటికీ క్షీణిస్తున్నాయి. హత్యలు, హత్యాయత్నాలు పెరిగిపోయాయి. అరికట్టాల్సిన పోలీస్ అధికారులు మిన్నకుండిపోతున్నారు. రూ.వందకు కూడా గొంతుకోసే పరిస్థితికి ప్రజలు దిగజారిపోతున్నారు. పోలీస్‌శాఖ కఠిన చర్యలు తీసుకోకపోతే ఇవి మరింతగా పెరిగే ప్రమాదముంది. పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలోని బడాబాబులు జూదమాడుతున్నా, పట్టించుకోని వైనం సబ్‌డివిజన్‌లో ఉంది. మొత్తం మీద గడిచిన మూడునెలల్లోనే హత్యలు, ఆత్మహత్యలు పెరిగిపోయాయి.

పెరిగిన హత్యలు

కదిరి సబ్‌డివిజన్‌లో గడిచిన మూడునెలలోనే మూడు హత్యలు. నాలుగు హత్యాయత్నాల కేసులు నమోదయ్యాయి. తాజాగా శుక్రవారం ఉదయం కదిరి మండలపరిధిలోని బండవారిపల్లిలో నవీన్ అనే వ్యక్తిని తెల్లవారుజామునే హత్య చేశారు. అదే గ్రామానికి చెందిన విశ్వనాథే హత్య చేశాడని, హత్యకు గురైన నవీన్‌తండ్రి ఫిర్యాదు చేశాడు. విశ్వనాథ్ భార్యతో నవీన్ ఫోన్‌లో చనువుగా మాట్లాడుతున్నాడన్న కారణంగానే హత్య చేసినట్లు సమాచారం. అలాగే గాండ్లపెంట మండలంలోని గుట్టకిందపల్లికి చెందిన రంగారెడ్డి, ఫీల్డు అసిస్టెంట్ మనోహర్ మధ్య వాగ్వాదం పెరిగి, చివరకు రంగారెడ్డి హత్యకు దారి తీసింది. కేవలం ఉపాధి బిల్లులు పెట్టలేదన్న వివాదంలో హత్య జరిగినట్లు తెలుస్తోంది. తలుపుల మండలంలో నెలక్రితం సరస్వతి అనే మహిళను సికిందర్ అనే వ్యక్తి హత్యచేసి పూడ్చిపెట్టాడు. దీనికి కారణం వారిద్దరి మధ్య ఉన్న వివాహేతర సంబంధమే. అలాగే ఎన్పీకుంట మండలంలో వంద రూపాయలు అప్పు ఇచ్చి అడిగినందుకు గొంతుకోసి హత్యా యత్నం చేసిన సంఘటన తెలిసిందే. అలాగే పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో ఓ వ్యక్తిపై కత్తులతో దాడి చేసి హత్యాయత్నం చేశారు. అదే నెలలోనే పార్కింగ్ విషయంలో తేడాలొచ్చి పార్కింగ్ బాయ్‌పై కత్తులతో దాడిచేయగా, పోలీసులు హత్యా యత్నం కేసు నమోదు చేశారు. రూరల్ పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలో ఓ హత్యాయ త్నం కేసు నమోదైంది. ఇలా హత్యలు, హత్యా యత్నాల కేసులు పెరిగిపోయాయి. శాంతిభద్రతలకు పూర్తిగా విఘాతం కలుగుతోంది. ఎప్పుడు ఎక్కడ ఏమి జరుగుతుందో అని ప్రజలు భయ భ్రాంతులకు గురవుతున్నారు. నిత్యం మహిళలు, విద్యార్థినులు ప్రయా ణాలు చేస్తుంటారు. వారిపై కూడా మద్యం మత్తులో ఉన్నవారు దాడిచేసే ప్రమాదముందని ప్రజలు అంటున్నారు.

పోలీస్ స్టేషన్ పక్కనే పేకాట

తలుపుల మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఓ పార్టీకి చెందిన బడాబాబులు ఓ ఇంట్లో నిత్యం పేకాట ఆడుతున్నట్లు సమాచారం. పోలీసుల వరకు సమాచారం వెళ్లినా, బడా బాబులను చూసీచూడనట్లు వదిలేసినట్లు సమాచారం. తలుపుల మండలంలో వారు బడా బాబులేకాకుండా, బలమైన సామాజికవర్గం కావడంతో పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేయలేదన్న ఆరోపణలున్నాయి. మారుమూల ప్రాంతంలో అడవుల్లో జూదమాడేవారి ఆచూకీ తెలుసుకుని దాడులు చేసే పోలీసులకు, పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే జూదమాడుతున్న జూదగృహం ఆచూకీ ఎందుకు తెలియలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు దృష్టిసారించాలని, శాంతిభద్రతలు కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

నాలుగేళ్లలో మరింత అభివృద్ధి చూస్తారు

● సుపరిపాలనకు తొలి అడుగులో పరిటాల శ్రీరామ్


పథకాలు అందని వారి వివరాలను యాప్‌లో నమోదుచేస్తున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరం, జూలై 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తొలిఏడాది పాలనపై ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోందని, ఇంకా నాలుగేళ్లలో మరింత అభివృద్ధి చూస్తారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్ పేర్కొన్నారు. పట్టణంలోని 19వ వార్డు ఇందిరానగర్‌లో శుక్రవారం నిర్వహించిన సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమంలో పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు.ఆయన స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్ర మాల గురించి ఆయన ప్రజలకు వివరించారు. అలాగే స్థానిక సమస్య లను అడిగితెలుసుకున్నారు. వాటిని పరిష్కరించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. కొన్ని చోట్ల సాంకేతిక కారణాలతో పథకాలు అందకపోవడంపై శ్రీరామ్ స్పందించారు. వీటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి, అందేలా చూస్తామన్నారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ... వైసీపీ గత ఐదేళ్ల పాలనలో విధ్వంసం తరువాత రాష్ట్రం ఇప్పుడిప్పుడే అభివృద్ధి వైపు అడుగులు వేస్తోందన్నారు. నాలుగేళ్లలో ప్రజలు మరింత అభివృద్ధిని చూస్తారని పరిటాలశ్రీరామ్ పేర్కొన్నారు.

ఘనంగా తొమ్మిదో సరిగెత్తు


చావిడిలో కొలువుదీరిన పీర్లు

ధర్మవరం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీచెన్న కేశవపురంలో శుక్రవారం లయన్స్ కంటి ఆస్పత్రి వద్ద మొహర్రం వేడుకల్లో భాగంగా తొమ్మిదో సరిగెత్తును ఘనంగా నిర్వహించారు. పీర్ల చావిడిలో ఖాసింస్వామి పీర్లు కొలువుదీరాయి. ఖాసిం స్వామికి ప్రత్యేక ప్రార్థన రం భక్తులు చక్కెర చదివింపులు చేయించారు.

పాఠశాలకు జనసేన నాయకుడి చేయూత

ఓబుళదేవరచెరువు, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండకమర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి జనసేన పార్టీ మండల నాయకుడు కొండబోయిన సతీష్ తమవంతుగా చేయూతనందించారు. పాఠశాల ఆవరణంలో స్టేజీ నిర్మాణానికి రూ.50వేలను శుక్రవారం ప్రధానోపాధ్యాయుడు క్రిష్టానాయక్‌కు పాఠశాలలో అందించారు.

ఆధ్యాత్మిక, పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేయాలి

● సీఎంకు బీజేపీ నాయకుల వినతి


సీఎంకు వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

పుట్టపర్తి రూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన పుట్టపర్తిని ఆధ్యాత్మిక-పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేసేందుకు తోడ్పాటు అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు బీజేపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. జిల్లా పర్యటనకు గురువారం వచ్చిన ముఖ్యమంత్రిని పుట్టపర్తి సత్యసాయి విమానాశ్రయం వద్ద కలసి విన్నవించినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. పుట్టపర్తిని ఆధ్యాత్మిక- పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని, సత్యసాయిబాబా జయంతిని రాష్ట్ర సెలవుగా దినంగా ప్రకటించాలని, జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయాలని కోరామన్నారు. అలాగే ఆధునిక క్రీడామైదానం, గ్రంథాలయం, ఔటర్‌రింగ్ రోడ్డు, బుక్కపట్నం చెరువు ఒడ్డున బాబా 100 అడుగుల విగ్రహం ఏర్పాటు, జిల్లాకేంద్రంలో శాశ్వత ప్రభుత్వ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విన్నవించామన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కళ్యాణ్‌కుమార్, మీడియా కోఆర్డినేటర్ జ్యోతిప్రసాద్, స్టేట్ కౌన్సిల్ సభ్యుడు సునీల్‌వైట్ల, పట్టణ కార్యదర్శి నారాయణన్ పాల్గొన్నారు.

కష్టపడేవారికి పార్టీ పదవులు

● ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి రఘునాథరెడ్డి


విజయ్‌కుమార్, డైరెక్టర్లను అభినందిస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి

పుట్టపర్తి రూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశంపార్టీలో కష్టపడి పనిచేసిన కార్యకర్త లకు తగిన గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘు నాథరెడ్డి పేర్కొన్నారు. మండలపరిధిలోని పెడపల్లి సింగిల్‌విండో అధ్యక్షుడిగా కొండూరు విజయ్‌కుమార్ శుక్రవారం పదవీబాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే, మాజీ మంత్రి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. నూతనంగా పదవులు అలంకరించిన సొసైటీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌ను, సొసైటీ డైరక్టర్లు తిప్పానాయక్, చిన్నకుళ్ళాయప్పను ఎమ్మెల్యే, మాజీమంత్రి పూలమాలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం ఇటీవల రాచువారిపల్లిలో విద్యుదాఘాతానికి గురై మృతిచెందిన ప్రసాద్ సతీమణి చంద్రకళకు సొసైటీ తరఫున రూ.2లక్షల బీమా చెక్కును అందజేశారు .కార్యక్రమంలో వెంగళమ్మచెరువు సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీరాంరెడ్డి, పెడపల్లి సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు చెన్నారెడ్డి, బుక్కపట్నం టీడీపీ కన్వీనర్ మల్‌రెడ్డి, సహకార సొసైటీ సీఈఓ చెన్నారెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు శ్రీరాంనాయక్, అమడగూరు టీడీపీ నాయకులు శ్యాంబాబు, గంగాధర్, ఎమ్మెల్యే పీఏ లక్ష్మీనారాయణ, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన 'బడా'

నల్లమాడ, జూలై 11(ఆంధ్రజ్యోతి): స్థానిక సింగల్‌విండో అధ్యక్షుడిగా బడా రమణారెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సింగిల్‌విండో అధ్యక్షుడిగా తనను ఎంపిక చేసిన ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లెరఘునాథరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే వారంలో ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలిపారు. ఆయనను పలువురు టీడీపీ నాయకులు అభినందించారు.

వేగంగా ఇళ్లు నిర్మించుకోవాలి

● హౌసింగ్ ఎస్‌ఈ కృష్ణయ్య

ధర్మవరం, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను వేగవంతంగా నిర్మించుకోవాలని హౌసింగ్ ఎస్‌ఈ కృష్ణయ్య లబ్ధిదారులకు సూచించారు. హౌసింగ్ ఎస్‌ఈతో పాటు పీడీ వెంకట నారాయణ, ఈఈ లక్ష్మీనారాయణమ్మ శుక్రవారం స్థానిక పోతుల నాగేపల్లి లేఅవుట్‌ను సందర్శించి, ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. త్వరంగా నిర్మాణాలు పూర్తి చేయాలని, బిల్లులు సక్రమంగా వస్తాయని లబ్ధిదారులకు సూచించారు. కాలనీలో సమస్యలు రాకుండా పరిష్కరిస్తా మన్నారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టే వారికి సిమెంట్, ఇసుక ఇస్తామన్నారు. అనంతరం ధర్మవరం సబ్‌డివిజన్ కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాల పురోగతిపై చర్చించారు. ఈ సమావేశంలో ఏఈ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

వేళాపాళాలేని కరెంటు కోతలు

● విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రైతుల నిరసన


మారాల సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

బుక్కపట్నం, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని మరాల సబ్‌స్టేషన్ పరిధిలో వేళపాళ లేని కరెంటు కోతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతుల వాపోయారు. దీంతో శుక్రవారం మారాల సబ్‌స్టేషన్ వద్ద రైతులు నిరసన వ్యక్తం చేశారు. పలువురు రైతులు మాట్లాడుతూ సబ్‌స్టేషన్ పరిధిలో వారంరోజులుగా లోవోల్టేజీ సమస్యలతో మోటార్లు, కాలిపోతున్నాయని, తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన చెందారు. మోటార్లు కాలిపోతున్నా, అధికారులు స్పందించడం లేదని మండిపడ్డారు. కోతలులేకుండా కరెంటు సరఫరా చేయాలని కోరారు. ఇప్పటికైనా సబ్‌స్టేషన్ పరిధిలో అధికారులు కరెంటు సమస్యను నివారించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఈయూ ఆవిర్భావ దినోత్సవం


జెండా ఆవిష్కరిస్తున్న ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

ధర్మవరం, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ధర్మవరం డిపో ఆవరణంలో ఎంప్లాయీస్ యూనియన్ 74వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. బస్టాండ్ ఆవరణంలో డిపో కార్యదర్శి ముస్తాఫా అధ్యక్షతన జరిగిన వేడుకలకు ఈయూ రాష్ట్ర కార్యదర్శి కేబీ నాగార్జునరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కేక్ కట్‌చేసి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కార్మికుల పక్షాన నిలబడి అనేక సమస్యలను పరిష్కా రానికి ఈయూ కృషిచేసిందన్నారు. భవిష్యత్తులో ఉద్యోగుల శ్రేయస్సు కోసం యూనియన్ ఎటువంటి ఉద్యమాలకు పిలుపు నిచ్చినీ అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం డిపోలోని కార్మికులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈయూ రీజనల్ నాయకులు బీ.నరసింహులు, ఆదినారాయణ, డిపో అధ్యక్షుడు తిరుమలేశ్, గ్యారేజ్ కార్యదర్శి మల్లికార్జున, నాయకులు బాబు, ఎల్‌హెచ్ కుమార్, వలీ, నజీర్ సాహెబ్, సుమో శీన, చింతా రామకృష్ణ, మాజీ నా యకులు ఈశ్వరయ్య, నూరీదు, నరసింహులు పాల్గొన్నారు.

అమ్మవార్లకు ఆషాఢం పూజలు


అలంకరణలో గొట్లూరు మహంకాళమ్మ, పెద్దమ్మ మూల విరాట్లు

ధర్మవరం రూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్లూరులో మహంకాళమ్మ, పెద్దమ్మ దేవతలకు ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఘనంగా పూజలు చేశారు. అమ్మవార్లను వివిధ రకాల పూలమాలలతో అలంకరించారు. గ్రామంలోని మహిళలు బోనాలను నెత్తిన ఎత్తుకుని వచ్చి అమ్మవార్లకు సమర్పించారు. అలాగే తీర్థప్రసాద పంపిణీ, అన్నదానం చేపట్టారు.

ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం


ర్యాలీ నిర్వహిస్తున్న మంత్రి సత్యకుమార్, వైద్యసిబ్బంది

ధర్మవరం, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. మంత్రి సత్యకుమార్ శుక్రవారం స్థానిక శివానగర్‌లోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శిం చారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు, రోగులతో మాట్లాడారు. కేంద్రంలో అందుతున్న వైద్యసేవలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆరోగ్య సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరాతీశారు. కేంద్రం పనితీరును పరిశీలించి సేవాపరంగా వారి అంకిత భావాన్ని అభినందించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... కుటుంబ నియంత్రణ, సంతానోత్పత్తి, ఆరోగ్య సంరక్షణ అంశాలపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర-2047 దిశగా తాము నడుస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ చెన్నారెడ్డి, డాక్టర్ సౌమ్య, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యశాల పరిశీలన


ప్రభుత్వ వైద్యశాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ ఫైరోజ్ బేగం

ఆంధ్రజ్యోతికి స్పందన

ఓబుళదేవరచెరువు, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం లోని ప్రభుత్వ వైద్యశాలను జిల్లా వైద్యాధికారి ఫైరోజ్ బేగం శుక్రవారం పరిశీలించారు. వైద్యశాల శిథిలావస్థకు చేరుకోవడంతో 'వైద్యశాలకు వెళ్లాలంటే భయం భయం' అనే వార్త ఈనెల 7న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ఆదేశాల మేరకు డీఎంహెచ్‌ఓ ఫైరోజ్ బేగం వైద్యశాలను పరిశీలించారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వైద్యశాల శిథిలావస్థకు చేరడంతో విధుల నిర్వహణ కష్టం అవుతోందన్నారు. దీంతో ఇటీవల నూతనంగా నిర్మించిన కంప్యూటర్ ల్యాబ్‌లో ఓపీ చూడాలని వైద్యులను ఆదేశించారు. ఇన్, అవుట్ రోగుల రికార్డులు పరిశీలించారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధులపై వైద్యులు భానుప్రకాష్‌నాయక్, కమల్ రోహిత్‌ను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని ఆకుతోట పల్లిలో పాయసం తిని పలువురు అస్వస్థతకు గురైన సంఘటనపై ఆరాతీశారు.

ఉత్సాహంగా సుపరిపాలనలో తొలిఅడుగు

ధర్మవరం జూలై 11(ఆంధ్రజ్యోతి): టీడీపీ శ్రేణుల ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం మండలంలో ఉత్సాహంగా కొనసాగుతోంది. పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు మండలంలోని రేగాటిపల్లిలో శుక్రవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. రేగాటిపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు అప్పిరెడ్డిగారి నాగిరెడ్డి, అప్పిరెడ్డిగారి కొండారెడ్డి, నాయకులు మిత్తిగొల్ల బూత్ కన్వీనర్ వరదరాజులు తదితరులు పాల్గొన్నారు.


పొడరాళ్లపల్లిలో...

ముదిగుబ్బ, జూలై 11(ఆంధ్రజ్యోతి): టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని పొడరాళ్లపల్లిలో టీడీపీ నాయకులు పర్యటించారు. తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి రమేష్‌బాబు, క్లస్టర్ ఇన్‌చార్జ్ తుమ్మల మనోహర్, నాయకులు అశ్వత్థరెడ్డి, చినగాని నరసింహ యాదవ్, నాగిరెడ్డి, తుమ్మల సూరి, గుర్రం కరుణాకర్, వెంకటనారాయణ, శేఖర్, డిష్ రామాంజి, గంగాధర్, మల్లెల నారాయణస్వామి, దాల్మిల్ సోము, రామయ్య, రాఘవ, అనిల్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.


ఎన్ రెడ్డివారిపల్లిలో...

నంబులపూలకుంట, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ఎన్‌రెడ్డివారిపల్లిలో శుక్రవారం టీడీపీ నాయకులు సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ దండు రవిశంకర్, వాటర్ షెడ్ ఛైర్మన్ పాలగిరి బాషా, గంగిరెడ్డి, బాబ్‌జీ, మగ్గం రామాంజి, చింతా శీన, మణికంఠరెడ్డి, దండోరా రెడ్డెప్ప, రవి, రమణ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కురవని వర్షం... ఆందోళనలో రైతులు

దాటిపోతున్న అదును.. ముందుకుసాగని సాగు పనులు

42వేల హెక్టార్లకు 5వేల హెక్టార్లలో సాగు

24వేల హెక్టార్లకుగాను 1600 హెక్టార్లలో వేరుశనగ

మడకశిర, జూలై 11(ఆంధ్రజ్యోతి): మేఘాలు రైతులను ఊరిస్తున్నాయి. అయితే వర్షం మాత్రం కురవడంలేదు. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రతి సంవత్సరంలాగానే ఈ యేడు కూడా వర్షాభావం వెంటాడుతుండటంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. గత ఏడు వేరుశనగ సాగుచేసి నష్టపోయిన రైతులు ఈ ఏడైనా పంటలు బాగా పండి అప్పుల ఊబి నుంచి బయటకు వస్తామన్న ఆశతో వేరుశనగ సాగుకు సిద్ధమయ్యారు. అయితే వర్షాలు సకాలంలో కురవడంలేదు. ఆకాశం మేఘావృతమవుతోందే తప్ప వర్షం మాత్రం కురవడంలేదు. దీంతో తాము పంటను సాగుచేసుకోలేకపోతున్నామని రైతులు అంటున్నారు. సాగు కోసం సిద్ధం చేసుకున్న విత్తనాలకు కొద్ది రోజులకు పురుగులు పడుతున్నాయని రైతులు అంటున్నారు. కొద్ది మంది రైతులు అరకొర తేమకే పంట సాగు చేశారు.. వర్షం పడక పోవడంతో ఆ పంటలు ఎండుముఖం పడుతున్నాయి. మేఘాలు ఊరిస్తున్నాయే తప్ప చినుకు మాత్రం రాలడం లేదని, రోజూ వర్షం కోసం ఎదురుచూస్తున్నామని రైతులు అంటున్నారు. కొద్ది మంది రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. నియోజకర్గంలో కంది 1000 ఎకరాలకు పైగా సాగు చేసినట్లు అధికారుల సమాచారం. నియోజకవర్గంలో ప్రతియేడు ఖరీ్‌ఫలో నార్మల్ ఏరియా 42వేల హెక్టార్లలో పంటలు సాగు చేస్తారు. ఇప్పటి వరకు 5వేల హెక్టార్లలో మాత్రమే సాగు చేశారు. ఇందులో వేరుశనగ నియోజకర్గంలో 24 వేల హెక్టార్లకుగాను ఇప్పటివరకు 1600 హెక్టార్లలో మాత్రమే సాగు చేశారు. మడకశిర మండలంలో 5200 హెక్టార్లకుగాను 500 హెక్టార్లు, అమరాపురం మండంలో 6600 హెక్టార్లకు 600, అగళి మండలంలో 2533 హెక్టార్లకు 300, రొళ్ల మండలంలో 4300 హెక్టార్లకు 500 హెక్టార్లలో సాగయ్యింది. ఇక గుడిబండ మండలంలో 5140 హెక్టార్లకు 1000 హెక్టార్లు వేరుశనగ పంట సాగు చేశారు. ఈ సీజన్‌లో కొద్దిపాటి వర్షం పడిందని, తరువాత కురవలేదని రైతులు అంటున్నారు. గత 5 సంవత్సరాలుగా ఇదే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మేఘావృతమైన ఆకాశం

వారం రోజుల్లో వర్షం బాగాపడాలని లేనిపక్షంలో సాగు కష్టమని అంటున్నారు.

వర్షం కోసం ఎదురు చూస్తున్నాం



గత ఏడాది రెండు ఎకరాల పొలంలో వేరుశనగ సాగు చేశాం. వర్షం పడకపోవడంతో పంట దెబ్బదిని నష్టపోయాం. ఈ ఏడు ఖరీఫ్‌లో సాగుకు సిద్ధమయ్యాం. ఇప్పటి వరకు వర్షం పడలేదు. ఆకాశం మేఘావృతమవుతోంది. చినుకు మాత్రం రాలడంలేదు. వారం రోజుల్లో వర్షం పడాలి. లేనిపక్షంలో ఇంటిలో నిల్వ ఉంచి వేరుశనగ విత్తనాలకు పురుగులు పడే అవకాశం ఉంది. వర్షం సకాలంలో పడితే వేరుశనగ సాగు చేస్తాం. లేనిపక్షంలో ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిసారిస్తాను.

-సురేష్, మల్లినమడుగు గ్రామం

5వేల హెక్టార్లలో సాగు..

ఖరీఫ్‌లో నార్మల్ ఏరియా 42 వేల హెక్టార్లు. ఇప్పటి వరకు 5వేల హెక్టార్లలో పంటలు సాగు చేశారు. ఇందులో వేరుశనగ 24వేల హెక్టార్లకు గాను 1600 హెక్టార్ల సాగయ్యింది. ఆగస్టు మొదటి వారం వరకు పంటలు సాగు చేసుకోవచ్చు.

-తిమ్మప్ప, వ్యవసాయశాఖ అధికారి, మడకశిర

సమస్యలను పరిష్కరించండి

- ఎమ్మెల్యేకి డ్రైవర్లు, ఓనర్ల వినతి

మడకశిర టౌన్, జూలై 11(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని నియోజకవర్గంలోని డ్రైవర్లు, ఓనర్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజును కోరారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను వారు కలిసి సమస్యలను వివరించారు. గతంలో మడకశిర పట్టణ సమీపంలో డ్రైవర్ల కోసం ఇంటి స్థలాలు మంజూరు చేశారని, అయితే కాలనీలో పలు సమస్యలు ఉండడం వల్ల కొంత మంది నిర్మించుకోలేక పోయారన్నారు. మౌలిక సదుపాయలు కల్పించాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు డ్రైవర్లు తెలిపారు.

కార్యవర్గం ఎంపిక

మడకశిర మండలానికి చెందిన డ్రైవర్లు శుక్రవారం సాయినగర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. యూనియన్ అధ్యక్షుడిగా సంజీవగౌడ్, గౌరవ అధ్యక్షుడిగా నరసింహమూర్తి, ఉపాధ్యక్షుడిగా రవి, కార్యదర్శిగా సైఫుల్లా, కోశాధికారులుగా సోమశేఖర్, భాస్కర్, జాయింట్ సెక్రటరీగా అనిల్‌కుమార్, ఈసీ మెంబర్స్‌గా దాదు, నంద, శీనా, నరసింహ, లక్ష్మీనారాయణ, సురేష్, చెన్నకేశవులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు అధ్యక్షుడు సంజీవగౌడ్ తెలిపారు.

సాంకేతికతపై అవగాహన కల్పించండి

తహసీల్దార్ మారుతి

గోరంట్ల, జూలై 11(ఆంధ్రజ్యోతి): సాంకేతికతపై ప్రజలకు కార్యదర్శులు, డిజిటల్ వెల్ఫేర్ అసిస్టెంట్లు అవగాహన కల్పించాలని తహసీల్దార్ మారుతి సూచించారు. ఎంపీపీ ప్రమీల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. 21 రోజుల్లో జనన, మరణాలను నమోదు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ పద్ధతిలో నమోదు అవుతున్నాయన్నారు. ప్రజలకు విషయాలు తెలిసేలా ప్రతి సచివాయలంలో నోటీసు బోర్డులు ఉంచాలని ఎంపీడీఓ నరేంద్రకుమార్ సచివాలయ సిబ్బందికి సూచించారు. వచ్చిన ప్రజలకు వాటిపై అవగాహన కల్పించాలన్నారు. సూర్యఘర్ పథకంపై ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసులు వివరించారు. బిల్లులు సకాలంలో అందడంలేదని పలువురు సర్పంచ్‌లు సమావేశానికి గైర్హాజరయ్యారు. ప్రభుత్వ అధికారుల ప్రసంగాలు మినహా ఎలాంటి చర్చ జరగకుండా మండల సర్వసభ్య సమావేశం ముగిసింది.

'చేనేత పరిశ్రమను కాపాడండి'

సోమందేపల్లి, జూలై 11(ఆంధ్రజ్యోతి): చేనేత పరిశ్రమను, కార్మికులను కాపాడాలని ఏపీ చేనేత సంఘం మండల కార్యదర్శి చీల నారాయణస్వామి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి కల్యాణమండపంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేతలను ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతిహామీని ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. ఇల్లులేని చేనేత కార్మికులకు పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. జీఎస్టీని రద్దుచేసి చేతిమగ్గాలకు 200యూనిట్లు ఉచిత విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. 50ఏళ్లకే పెన్షన్ సదుపాయం కల్పించాలన్నారు. ఎలక్ట్రానిక్ జాకార్డులు రాయితీతో అందించాలన్నారు. ఆదరణ ద్వారా పనిముట్లు, వర్క్‌షాపులను విరివిగా మంజూరుచేయాలని కోరారు. సమావేశంలో చేనేతలు దాసరి సుధాకర్, ఉడుమల నారాయణస్వామి, దేవాంగం వెంకటేశులు, బాలంక్రిష్ణయ్య, వీరాంజనేయులు పాల్గొన్నారు.

నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు అమ్మితే కేసులు

నగర పంచాయతీ కమిషనర్ సతీష్ కుమార్

పెనుకొండ, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిషేధించిన తక్కువ మైక్రాన్‌ఉన్న కవర్లు, గ్లాసులు ఇతర ప్లాస్టిక్ వస్తువులను విక్రయిస్తే కేసులు నమోదుచేస్తామని నగర పంచాయతీ కమిషనర్ సతీష్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం ఆయన సిబ్బందితో కలిసి ఎస్‌కేడీ సర్కిల్ నుంచి తెలుగుతల్లి సర్కిల్ వరకు దుకాణాలు, హోటళ్లను ఆకస్మిక తనిఖీ చేశారు. తక్కువ మైక్రాన్‌గల ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, ఇతర వస్తువులు దాదాపు 6.9 కేజీల వస్తువులను సేకరించి ధ్వంసం చేశారు. పునరావృతమైతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

వైద్యాధికారి నాగరాజునాయక్



గర్భిణులకు అన్నదానం

పెనుకొండ రూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): గర్భవతులు పౌష్టికాహారం తీసుకోవాలని గుట్టూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి నాగరాజునాయక్ సూచించారు. శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన గర్భవతులకు వైద్య పరీక్షల అనంతరం అన్నదానం నిర్వహించారు. ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సవిత ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించినట్లు వైద్యాధికారులు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది డీకే సుబ్రహ్మణ్యం, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలను వినియోగించుకోండి

ఆయుష్ వైద్యురాలు సునీత

గోరంట్ల, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఆయుర్వేద వైద్యసేవలను వినియోగించుకోవాలని ఆయుష్ డాక్టర్ సునీత సూచించారు. గోరంట్లలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయుర్వేద వైద్యంలో ఎలాంటి ఇతర సమస్యలు తలెత్తవన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా పారిశుధ్యం పనులు చేపట్టాలని లేకుంటే ప్రమాదకరమైన మలేరియా, డెంగీ తదితర వ్యాధులు వ్యాపించే ప్రమాదముందన్నారు. దోమల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జనాభా దినంపై ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

రొద్దం, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది జనాభా దినోత్సవంపై శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. రొద్దంలోని ప్రభుత్వ ఆసుపత్రి నుంచి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకోవాలని, 30 నిముషాలు యోగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి సోమశేఖర్‌రెడ్డి, సీహెచ్ఓ శశికళ, సూపర్‌వైజర్ బేబిరాణి, పీహెచ్ఎన్ లక్ష్మీనరసమ్మ పాల్గొన్నారు. అదే విధంగా సోమందేపల్లి, పెనుకొండ తదితర ప్రాంతాల్లో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు.

బిందూనగర్‌లో ఎన్టీఆర్ శుద్ధజలకేంద్రం

భూమిపూజ చేసిన మంత్రి సవిత

పరిగి, జూలై 11(ఆంధ్రజ్యోతి): బిందూనగర్‌లో ఎన్టీఆర్ శుద్ధజల కేంద్రానికి శుక్రవారం మంత్రి సవిత భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సౌందీప్ ఫౌండేషన్ యాజమాన్యం సందీప్‌కుమార్ ప్రసాద్, సునీల్‌శర్మ రూ. 25 లక్షలతో తాగునీటి సమస్యను తీర్చేందుకు ముందుకు హర్షణీయమన్నారు. అనంతరం స్థానికులు డ్రైనేజీ సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రానున్న నిధులతో డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపాలని పంచాయతీ కార్యదర్శి అరుణకు సూచించారు. అనంతరం ధనాపురం ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జంగాలపల్లి నుంచి ఉన్నతపాఠశాలకు రావాలంటే బస్సు సౌకర్యంలేదని, క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లను అందజేయాలని మంత్రిని కోరారు. సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు. అక్కడి నుంచి నర్సాపురంలో సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వె ళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి సవిత

వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హసీనాసుల్తాన, ఎంపీడీఓ రెడ్డప్ప, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ హిమబిందు, మండల కన్వీనర్ ఎస్ఎన్ గోవిందరెడ్డి, సర్పంచ్ బాలాజీ, మాజీ ఎంపీపీ ఆదినారాయణరెడ్డి, జిల్లా యువత కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సోమప్ప, కాంట్రాక్టర్ మహేశ్వర్‌రావు, వడ్డె హనుమయ్య, లక్ష్మణ్‌రావు, శాసనకోట వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం

సీనియర్ సివిల్ న్యాయాధికారి వెంకటేశ్వర్లు నాయక్

హిందూపురం, జూలై 11(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలికంగా ఉన్న కేసులను మధ్యవర్తిత్వంతో పరిష్కారం చేసుకోవచ్చని సీనియర్ సివిల్‌న్యాయాధికారి వెంకటేశ్వర్లు నాయక్ అన్నారు. శుక్రవారం స్థానిక కోర్టు ఆవరణంలో న్యాయవాదులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భారత అత్యున్నత న్యాయస్థానం కేసుల సత్వర పరిష్కారం కోసం మధ్యవర్తిత్వం-రాజీపథక సంఘం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీనిద్వారా సమయం వృథాకాకుండా ఆర్థికంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా కేసులు పరిష్కారం అవుతాయన్నారు. వాణిజ్య, వ్యక్తిగత సంబంధాలు ఏమాత్రం చెడిపోకుండా ఉంటాయన్నారు. మధ్యవర్తిత్వం కక్షిదారుల సమస్య పరిష్కారంలో ఎంతో దోహదపడుతుందన్నారు. ఇప్పటికే కొన్ని నగరాల్లో మధ్యవర్తిత్వ కేంద్రాల ద్వారా ఎన్నో కేసులు పరిష్కారం



న్యాయవాదులకు సూచనలు ఇస్తున్న న్యాయాధికారి

అవుతున్నాయన్నారు. దీనిపై న్యాయవాదులు కక్షిదారులకు తెలియజేసి కేసులు పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు సిద్దు, రాజశేఖర్, కళావతి, సంతోష్‌కుమారి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హిందూపురం, జూలై 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపేస్తున్నట్లు తెలిపారు. ముద్దిరెడ్డిపల్లివద్ద ఉన్న 33కేవీ, పెద్దరెడ్డిపల్లి, సూగూరు వద్ద ఉన్న 33కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు జరుగనున్నాయన్నారు. దీంతో ఎస్. సడ్లపల్లి, ఆటోనగర్, టీచర్స్‌కాలనీ, విద్యానగర్, హౌసింగ్ బోర్డు, ప్రశాంతినగర్, సూగూరు, విద్యానగర్, పోచనపల్లి, వాల్మీకి సర్కిల్, చిన్నమార్కెట్, గాంధీసర్కిల్, మెయిన్‌రోడ్డు, ఎంఎఫ్‌రోడ్డు, నింకంపల్లి రహమత్‌పురం, సీపీఐ కాలనీ, పాండురంగనగర్, కోట, అంబేద్కర్‌నగర్, మెయిన్‌బజార్, డీఎల్‌రోడ్డు, రైల్వే రోడ్డు, ముక్కడిపేట, నేతాజీనగర్ ప్రాంతాల్లో విద్యుత్‌సరఫరా ఉండదన్నారు.

పూడికతీత పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

సోమందేపల్లి, జూలై 11(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం కింద మండలంలోని గుడిపల్లి గ్రామంలో జరుగుతున్న రంగనాథస్వామి ఆలయం కోనేరు పూడికతీత పనులను శుక్రవారం ఎంపీడీఓ వెంకటలక్ష్మీ పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని ఏపీఓ సోమశేఖర్‌రెడ్డిని ఆమె ఈ సందర్భంగా ఆదేశించారు. అనంతరం చెరువుకట్ట సుందరీకరణ పనుల్లో భాగంగా చేస్తున్న జంగిల్‌క్లియరెన్స్ పనులను పర్యవేక్షించారు. గ్రామస్థులతో మాట్లాడారు. అభివృద్ధిలో భాగంగా ఉపాధిహామీ పథకాన్ని అనుసంధానం చేస్తూ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు.

'జాబిలి'కి ఇంటర్నేషనల్ గ్లోరీ అవార్డు



అవార్డు అందుకుంటున్న జాబిలి

పెనుకొండ, జూలై 11(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన కవి, సాహితీవేత్త, విమర్శకుడు, సామాజిక సేవాకర్త, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జాబిలి చాంద్‌బాషా ఇంటర్నేషనల్ గ్లోరీ అవార్డును అందుకున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని త్యాగరాజ గాన సభలో మనం ఫౌండేషన్ డాక్టర్ చక్రవర్తి ఆధ్వర్యంలో జరిగిన తెలుగు మహాకవి సమ్మేళనానికి విశిష్ట అతిథిగా పాల్గొన్న జాబిలి చాంద్‌బాషాను గ్లోరీ అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా రచయితల సంఘం ఆయనకు అభినందనలు తెలిపారు.

అమ్మవారికి మహాపుష్పాభిషేకం



హిందూపురం, జూలై 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారికి ఆషాఢమాసం పురస్కరించుకుని శుక్రవారం మహాపుష్పయాగం నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళలు వివిధ రకాల పూలను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు జే పీకేరాము, శ్రీకాంత్, రవి, తదితరులు పాల్గొన్నారు.

శాకంబరిగా యల్లమ్మదేవి

పట్టణంలోని నింకంపల్లి రోడ్డులో వెలసిన యల్లమ్మదేవికి శుక్రవారం శాకంబరిదేవిగా అలంకరించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు.

పెనుకొండ, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం అమ్మవారిని శాకంబరి రూపంలో అలంకరించారు. అశేష సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కొత్తిమీర, కరివేపాకుతో వడిశలమ్మకు అలంకరణ



మడకశిర టౌన్, జూలై11(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని అమరాపురం బస్టాండ్ ఆవరణలో వెలసిన వడిశలమ్మకు శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం నుంచి అర్చనలు, అభిషేకాలను నిర్వహించారు. అనంతరం అమ్మవారికి కొత్తిమీర, కరివేపాకుతో అలంకరణ చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా ఈయూ ఆవిర్భావ దినోత్సవం

మడకశిర రూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): ఈయూ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఆర్టీసీ కార్మికులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ రీజినల్ ఉపకార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ.. ఈయూ కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటాలు కొనసాగిస్తోందన్నారు. కార్యక్రమంలో రీజినల్ కార్యదర్శి సిద్దగంగప్ప, డిపో అధ్యక్షులు రఫీక్, రంగనాథ్, నారాయణస్వామి నాయక్, గోపాల్ పాల్గొన్నారు.



వేడుకలో పాల్గొన్న ఆర్టీసీ కార్మికులు

పేదల సంక్షేమమే లక్ష్యం: ఎమ్మెల్యే



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

గుడిబండ,జూలై 11(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు అన్నారు. శుక్రవారం మండలంలోని సంకరగల్లు పంచాయతీలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజా సంక్షేమాన్ని విస్మరించారని ఆరోపించారు. చంద్రబాబునాయుడు హయాంలో పేద ప్రజల సంక్షేమ అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజలకు అందించడం జరిగిందన్నారు. వృద్ధులకు, వితంతువులు, వికలాంగులకు పింఛన్ల పెంపు పాఠశాలలో చదివే విద్యార్థులకు తల్లికి వందనం ఇలా ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పార్టీ అందించడం జరిగిందన్నారు. చంద్రబాబు హయాంలోనే రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందుతోందన్నారు. అనంతరం కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి, మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, నజీర్‌అహ్మద్, బాదేపల్లి అప్ప భీమరాజు, బాలేపల్లిరాజు పాల్గొన్నారు.

అమరాపురంలో..



అమరాపురం, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం హిందూపురం పార్లమెంటరీ యువత ఉపాధ్యక్షులు శివకుమార్, మండల వాల్మీకి సంఘం అధ్యక్షుడు హరీష్‌కుమార్, బూత్‌ఇన్‌చార్జిలతో ఏడాది పాలనపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఏడాది పాలనలో సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.

రాచూరులో...



రొద్దం(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకుడు మాధవనాయుడు అన్నారు. రొద్దం మండల పరిధిలోని రాచూరు గ్రామంలో సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో రామకృష్ణప్ప, చంద్రమౌళి, చిన్నప్పయ్య, కన్వీనర్ నరహరి, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

మల్లినమడుగులో..



రొళ్ల, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మల్లినమడుగు పంచాయతీలో సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమాన్ని శుక్రవారం టీడీపీ నాయకులు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. యూనిట్ ఇన్‌చార్జి జగన్నాథ్, బూత్ కన్వీనర్లు హనుమంతరాయప్ప, శ్రీనివాసులు, నారాయణప్ప, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి కార్యక్రమానికి హాజరుకానున్న ఎమ్మెల్యే

మండలంలోని రొళ్ల పంచాయతీలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని శనివారం ఉదయం నిర్వహించనున్నామని మార్కెట్‌యార్డ్ చైర్మన్ ఉగ్రేగౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు , మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొంటారని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని సూచించారు.

మునిమడుగులో..



పెనుకొండ రూరల్, జూలై11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధి కోసం చంద్రబాబునాయుడు కృషిచేస్తున్నారని మండల కన్వీనర్ శ్రీరాములు అన్నారు. శుక్రవారం మండలంలోని మునిమడుగు, గుట్టూరు గ్రామాల్లో సుపరిపాలనకు తొలిఅడుగు నిర్వహించి కరపత్రాలు అందజేసి ప్రజలకు సంక్షేమపథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కేశవయ్య, ఈశ్వరప్రసాద్, చిన్నవెంకటరాముడు, మాజీ జడ్పీటీసీ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేడు శెట్టిపల్లి, రాంపురంలో..

శనివారం శెట్టిపల్లి, రాంపురంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీడీపీ నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు.

ముద్దిరెడ్డిపల్లిలో..



హిందూపురం, జూలై11(ఆంధ్రజ్యోతి): ముద్దిరెడ్డిపల్లిలోని 35వ వార్డులో శుక్రవారం సుపరిపాలన తొలిఅడుగు నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిందని, ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చంద్రమోహన్, రవీంద్రనాయుడు, నరసింహమూర్తి, నాగేంద్ర, రామాంజినేయులు, నూర్‌బాష తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులకు ట్రాక్టర్

గోరంట్ల, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదిలి పంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులు చేపట్టేందుకు ట్రాక్టర్ మంజూరయ్యింది. ట్రాక్టర్‌ను శుక్రవారం ఎంపీడీఓ నరేంద్రకుమార్ ప్రారంభించారు. పంచాయతీని పరిశుభ్రంగా ఉంచి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని సూచించారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులకు ఆయన మాస్కులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రామాంజనేయులు, కార్యదర్శి జైపాల్‌రెడ్డి, టీడీపీ నాయకులు లక్ష్మీపతి, ప్రభుశంకర్, కుమార్‌గౌడ్, రవి పాల్గొన్నారు.